# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 8

ఆదివారం, ఆగస్టు 11, 2024




## మూడో విడత రుణ మాఫీకి నిధులు సిద్ధం!



హైదరాబాద్, ఆగస్టు 10: నిర్దేశిత గడువుకల్లా రుణ మాఫీ పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్న రాష్ట్ర సర్కారు అందుకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడంపై దృష్టిసారించింది. ఈమేరకు మూడో విడత రుణ మాఫీ కోసం నిధులను సిద్ధం చేసుకుంటోంది. ఇప్పటికే ప్రభుత్వం రెండు విడతల్లో లక్షన్నర రూపాయల వరకు అప్పు ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.12,225 కోట్లు జమ చేసింది. మూడో విడతలో మరో 6 లక్షల మంది రైతుల రుణాలను మాఫీ చేయాల్సి ఉంటుందని, ఇందుకు రూ.6,000 కోట్లకుపైగా నిధులు అవసరమవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.



## తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని విమానాశ్రయాలు

**కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు**

**10కే మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు**

శంషాబాద్: తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం మరిన్ని నగరాల్లో విమానాశ్రయాల నిర్మాణానికి కసరత్తు చేస్తున్నామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వారోత్సవాల సందర్భంగా బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ అధికారుల ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్ విమానాశ్రయంలో 10కే మారథాన్ నిర్వహించారు. దీన్ని రామ్మోహన్‌నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. విమానాశ్రయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణానికి 2002లో చంద్రబాబునాయుడు హయాంలోనే బీజం పడిందన్నారు. అక్కడ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌గా తీర్చిదిద్దాలని ఆయన దూరదృష్టితో 5,500 ఎకరాల భూసేకరణ చేపట్టారని తెలిపారు. ఇంత భూమి అవసరమా? అంటూ అప్పట్లో చాలామంది అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు.

- మిగతా 2వ పేజీలో



# వచ్చే ఏడాది నుంచి రేషన్ సన్నబియ్యం

**చౌక ధర దుకాణాల ద్వారా పంపిణీ**

**కుటుంబ వివరాలతో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులు**

**కొత్త రేషన్ కార్డులపై ప్రజాభిప్రాయ సేకరణ**

**గ్రామాల్లో రూ.లక్షన్నర, పట్టణాల్లో 2 లక్షల ఆదాయ పరిమితి**

**మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయాలు**

హైదరాబాద్, ఆగస్టు 10: వచ్చే ఏడాది నుంచి చౌక ధర దుకాణాల ద్వారా సన్నం బియ్యం పంపిణీ చేయాలని.. కొత్త తెల్ల రేషన్ కార్డుల జారీ వి?ధి విధానాలపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. చౌక ధర దుకాణాలు, మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఏటా 24 లక్షల టన్నుల దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా, సగంపైగా దారి మళ్లుతోందని గుర్తించింది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు.. ప్రతి ఒక్కరూ తినడానికి అనువుగా ఉండేలా చౌక ధర దుకాణాల ద్వారా సన్నబియ్యంఅందజేయాలని పేర్కొంది.

రేషన్ కార్డులతో పాటు రాజీవ్ ఆరోగ్య శ్రీ కార్డులను స్మార్ట్ కార్డుల రూపంలో ఇవ్వనున్నారు. కుటుంబం సమగ్ర ఆరోగ్య వివరాల (హెల్త్ ప్రొఫైల్)తో రాజీవ్ ఆరోగ్య శ్రీ కార్డులు జారీ చేయాలని సూచించింది. ఆరోగ్య శ్రీ ప్రయోజనం కోసం కొందరు తెల్ల కార్డులు తీసుకుంటున్నారని.. వేర్వేరుగా జారీ చేస్తే ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయపడింది. మంత్రివర్గ ఉప సంఘం సమావేశం శనివారం సచివాలయంలో పౌర సరఫరాలు, నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. వైద్యారోగ్య, రెవెన్యూ శాఖల మంత్రులు దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు.

పట్టణాల్లో రూ.2 లక్షల్లోపు, గ్రామాల్లో రూ.లక్షన్నర వార్షికాదాయం లేదా మాగాణి 3.50 ఎకరాలు లేదా చెల్క 7.5 ఎకరాల లోపు ఉన్నవారికే తెల్ల కార్డులివ్వాలని ప్రతిపాదించింది. పెండింగ్‌లో పది లక్షల దరఖాస్తులున్నట్లు పేర్కొంది. ఏపీ, తెలంగాణల్లోనూ కార్డులున్న వారికి ఆప్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ అర్హతలపై విస్తృత స్థాయిలో అభిప్రాయ సేకరణకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు తక్షణమే లేఖలు రాసి సూచనలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫీషియో కార్యదర్శి డీఎస్ చౌహాన్‌కు మంత్రి ఉత్తమ్ సూచించారు. దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నవారెవరూ తెల్ల కార్డు అవకాశం కోల్పోకుండా అధ్యయనం జరగాలనేదే ఉద్దేశంగా పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో జొయిటిస్, మోనార్క్ ట్రాక్టర్స్ విస్తరణ

**అమెరికాలో సీఎంతో భేటీ అయిన కంపెనీల ప్రతినిధులు**



హైదరాబాద్, ఆగస్టు 10: ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ విశ్వ విద్యాలయం సంసిద్ధత వ్యక్తం చేసింది. రాష్ట్రంలో బయో డిజైన్ శాటిలైట్ సెంటర్ ఏర్పాటుకు ఆసక్తి కనరబరుస్తూ అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ అందజేసింది. శనివారం స్టాన్‌ఫర్డ్ వర్సిటీని సీఎంతో పాటు మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సందర్శించింది. బైర్స్ సెంటర్ ఫర్ బయో డిజైన్ విభాగంలోని సీనియర్ ప్రతినిధులతో పలు అంశాలపై చర్చలు జరిపింది.

ఆరోగ్య సంరక్షణలో ఆవిష్కరణలు, విద్య, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై ప్రధానంగా సమాలోచనలు చేసింది. కొత్తగా నెలకొల్పనున్న స్కిల్ యూనివర్సిటీ, లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీల్లో భాగస్వామ్యం కావాలని, తెలంగాణలో కేంద్రం ఏర్పాటు చేయాలని స్టాన్‌ఫర్డ్ బయో డిజైన్ అధికారులను సీఎం రేవంత్ ఆహ్వానించారు. ఉమ్మడి పరిశోధనలు నిర్వహిస్తూ ఆధునాతన పరిజ్ఞానాన్ని పంచుకోవాలని ప్రతిపాదించారు. సానుకూలంగా స్పందించిన స్టాన్‌ఫర్డ్ ప్రతినిధులు.. వైద్య పరికరాల విద్య, ఆవిష్కరణలకు మద్దతు ఉంటుందని తెలుపుతూ సీఎం రేవంత్‌కు లేఖ అందజేశారు. భారీ వైద్య పరికరాల పరిశ్రమ అభివృద్ధిపై రాష్ట్ర సర్కారు చొరవ ఎందరికో ఉపాధి చూపుతుందని, దీనిపై తెలంగాణ ప్రభుత్వం దృష్టిసారించడం అభినందనీయమన్నారు.

యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. స్టాన్‌ఫర్డ్ వంటి ప్రపంచ స్థాయి వర్సిటీ భాగస్వామ్యంతో ఆరోగ్య సంరక్షణ రంగంలో తెలంగాణ యువతకు ఆధునిక నైపుణ్యం, పరిజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో ఉన్నట్లు సీఎం తెలిపారు. ఇది తెలంగాణ యువత భవిష్యత్తుకు కొత్త బాటలు వేస్తుందని అన్నారు. పరిశ్రమలు, ఆవిష్కరణల్లో దేశంలోనే అగ్రగామిగా ఉన్నామని వివరించారు. తెలంగాణ-స్టాన్‌ఫర్డ్ భాగస్వామ్యం ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య

- మిగతా 2వ పేజీలో

## మళ్లీ రేవంత్‌తో భేటీ!



**తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం**

**ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి**

**ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లు విధ్వంసం జరిగిందని ఆవేదన**

హైదరాబాద్, ఆగస్టు 10: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. అవసరమైతే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో మరోసారి భేటీ అవుతానని ప్రకటించారు. తెలంగాణలో త్వరలో గ్రామస్థాయి నుంచి పార్టీని పునర్నిర్మిస్తామని చెప్పారు. శనివారం ఆయన ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ రాష్ట్ర ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. పార్టీ సభ్యత్వ నమోదు, కింది స్థాయి నుంచి నాయకత్వాన్ని తయారు చేయడం తదితర అంశాలపై చర్చించారు.

## ఫైలేరియా, నులిపురుగుల నివారణపై దృష్టి

**మంత్రి దామోదర రాజనర్సింహ**



హైదరాబాద్, ఆగస్టు 10: ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనక తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆయుష్, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి (స్వతంత్ర) ప్రతాప్ రావు జాదవ్ అధ్యక్షతన నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ తన కార్యాలయం నుంచి పాల్గొని రాష్ట్రంలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ తెలంగాణలో ఫైలేరియా, నులిపురుగుల నివారణకు చేపడుతున్న చర్యలను కేంద్రమంత్రికి వివరించారు. రాష్ట్రంలో సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాలలో 14 ఆరోగ్య కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 2600 మంది సిబ్బందిని భాగస్వామ్యం చేశామని, 2522 మంది మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేటర్లు క్షేత్రస్థాయిలో ఐవర్ మెక్టిన్ మాత్రలను అందజేస్తారని వివరించారు. అనంతరం ఫైలేరియా, నులిపురుగుల నివారణకు చేపడుతున్న చర్యలపై రూపొందించిన అవగాహన కరపత్రాలను, బ్రోచర్లను ఆవిష్కరించారు.

## తెలంగాణ పోరాటం తరహాలో.. బీసీల రిజర్వేషన్లకు ఉద్యమించాలి

**'బీసీల సత్యాగ్రహ దీక్ష'లో వక్తలు**



రాంనగర్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన తరహాలో.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కూడా ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సత్వరం కులగణన చేపట్టడంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ శనివారం బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్ నేతృత్వంలో హైదరాబాద్ ధర్నాచౌక్‌లో 'బీసీల సత్యాగ్రహ దీక్ష' జరిగింది. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు హాజరై దీక్షకు మద్దతు తెలిపారు. తొలుత శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీల పోరాటం మొదలైన సమయంలోనే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని, అనంతరం బీసీ ఉద్యమం

- మిగతా 2వ పేజీలో



## కొత్తగా ఆరు రైల్వే లైన్లు!

**తెలంగాణలో 19 కి.మీ, ఏపీలో 85 కి.మీ దూరం నిర్మాణం**

**కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం**

ఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి వరంగల్ వరకు 1,316 కిలోమీటర్ల మేర తలపెట్టిన రైల్వే కారిడార్‌లో భాగంగానే మల్కన్‌గిరి-పాండురంగాపురం మధ్య కొత్త రైల్వే మార్గం నిర్మించనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టంచేశారు. ఈ కారిడార్‌లో భాగంగా జునాగఢ్ నుంచి నవరంగ్‌పుర్ వరకు ఒకటి, మల్కన్‌గిరి నుంచి పాండురంగాపురం వరకు ఇంకొకటి చొప్పున రెండు మార్గాలకు శుక్రవారం కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసినట్లు తెలిపారు. శనివారం ఇక్కడ తన కార్యాలయంలో కేంద్ర మంత్రి విలేకర్లతో మాట్లాడారు. "డబుల్ లైన్‌గా నిర్మించే ఈ ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.7,382 కోట్లు. దక్షిణాదిలోని థర్మల్ పవర్ ప్లాంట్లకు బొగ్గు సరఫరా చేయడం.., తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్, ఒడిశా రాష్ట్రాల్లోని బొగ్గు గనుల నుంచి రైల్వే మార్గాలను అనుసంధానం చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య లక్ష్యం. ఈ రైల్వే మార్గం తెలంగాణలో 19.77 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో

- మిగతా 2వ పేజీలో



## కేరళకు అండగా ఉంటాం

**పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం.. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాని హామీ**

**విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన.. పునరావాస ప్రణాళికపై సమీక్ష**

వయనాడ్, ఆగస్టు 10: కొండచరియలు విరిగిపడి వరదలు పోటెత్తటంతో అతలాకుతలమైన కేరళకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తులో కుటుంబసభ్యులను కోల్పోయిన వారికి అండగా ఉంటామన్నారు. కేరళలో ప్రధాని మోదీ శనివారం ఏరియల్ సర్వే జరిపారు. చూరల్‌మల, ముందక్కై, పంచరిమట్టం తదితర ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని వీక్షించారు. అనంతరం వయనాడ్‌లోని కాల్పెట్టాలో దిగి రోడ్డు మార్గంలో చూరల్‌మలకు వెళ్లారు. అక్కడ సహాయకచర్యల్లో భాగంగా ఆర్మీ నిర్మించిన 190 అడుగుల బెయిలీ బ్రిడ్జిపై నడిచి పరిసరాల్లో సంభవించిన నష్టాన్ని పరిశీలించారు. స్థానికంగా ఏర్పాటైన పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కోల్పోయిన కుటుంబసభ్యులను, జరిగిన నష్టాన్ని తల్చుకొని కన్నీరుమున్నీరైన పలువురిని ప్రధాని మోదీ ఓదార్చారు. గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కూడా మోదీ పలకరించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బాధితులకు పునరావాసం కల్పించే

- మిగతా 2వ పేజీలో

## అసన్‌సోల్-వరంగల్ కారిడార్‌లో భాగంగా మల్కన్‌గిరి-పాండురంగాపురం రైల్వే మార్గం

- మొదటిపేజీ తరువాయి

85.5 కిలోమీటర్ల మేర సాగుతుంది. ఇవి గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు. వీటితో తూర్పుగోదావరి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ఇందులో భాగంగా గోదావరిపై మరో వంతెన నిర్మిస్తాం. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తూర్పు తీరంలో రాకపోకలు నిలిచిపోతే.. ప్రత్యామ్నాయంగా ఈ మార్గంలో రైళ్లు నడపడానికి వీలవుతుంది. గిరిజన ప్రాబల్యం ఉన్న ప్రాంతాల గుండా సాగే ఈ మార్గం పూర్తయితే వెనకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. కొత్త ఆర్థిక కార్యకలాపాలు మొదలవుతాయి. వామపక్ష ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు మెరుగుపడతాయి' అని వివరించారు. త్వరలో నిర్మాణ పనులు మొదలుపెట్టి అయిదేళ్లలో పూర్తిచేస్తామని వివరించారు. ఆ ప్రాజెక్టులో చాలా సొరంగమార్గాలు వస్తాయన్నారు.

### విశాఖ రైల్వేజోన్‌పై పురోగతి

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియలో పురోగతి ఉన్నట్లు అశ్వినీ వైష్ణవ్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడానని, త్వరలో భూమి కేటాయిస్తామని చెప్పారని వెల్లడించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో ఈ విషయమై తాను నిరంతరం మాట్లాడుతున్నట్లు తెలిపారు.

### భద్రాచలానికి రైల్వే లైన్ కల నెరవేరింది: కిషన్‌రెడ్డి

మల్కన్‌గిరి-పాండురంగాపురం రైల్వే లైన్ నిర్మాణంతో భద్రాచలం పట్టణానికి రైలు సౌకర్యం కల నెరవేరుతుందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల మధ్య రాకపోకలు పెరగడమే కాకుండా ఆయా ప్రాంతాలు వ్యవసాయం, వాణిజ్యం, విద్య, పర్యాటకం, వైద్యారోగ్య రంగాలలో వృద్ధిని సాధించడానికి దోహదపడుతుందన్నారు. ఛత్తీస్‌గఢ్ వాసులు హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలను చేరుకోవడానికి ప్రయాణ సమయం తగ్గుతుందని, దక్షిణ, మధ్య ఒడిశా నుంచి హైదరాబాద్, విజయవాడ నగరాలకు అనుసంధానత ఏర్పడుతుందని వివరించారు. 'పారాదీప్ పోర్టును అనుసంధానిస్తూ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జాతీయ జలమార్గం-5తో ఈ రైల్వేలైన్‌ను అనుసంధానించి మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్‌ను అభివృద్ధిచేసే అవకాశం కూడా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో ఉన్న కృష్ణపట్నం, మచిలీపట్నం, నూతనంగా నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టుల నుంచి సరుకు రవాణాను సమర్థంగా నిర్వహించడానికి వీలవుతుంది' అని కిషన్‌రెడ్డి వివరించారు. ఈ రైల్వే ప్రాజెక్టుతో పాటు.. రైల్వే బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని వెల్లడించారు.



## కేరళకు అండగా ఉంటాం

- మొదటిపేజీ తరువాయి

ప్రణాళికపై మాట్లాడారు. కేరళలో విపత్తు సంభవించిన నాటి నుంచి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటున్నానని, రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ ఖాన్, సీఎం విజయన్, కేంద్రమంత్రి సురేష్‌గోపి తదితరులు ప్రధాని పర్యటనలో పాల్గొన్నారు.

### మణిపూర్‌ను కూడా మోదీ సందర్శించాలి

ప్రధాని కేరళ పర్యటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో స్పందిస్తూ.. 'కేరళలో దారుణమైన విషాదం సంభవించింది. నాన్-బయలాజికల్ ప్రధాని వయనాడ్‌కు వెళ్లటం మంచిదే. దీని తర్వాత ఆయన యుద్ధాన్ని మరోసారి నిలిపివేయటానికి ఉక్రెయిన్‌కు వెళ్లనున్నారు.

అయితే, గత 15 నెలలుగా తీవ్రమైన బాధ, దుఃఖంలో ఉన్న మణిపూర్ వెళ్లటానికి కూడా ఆయనకు సమయం దొరుకుతుందని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. కాగా, వయనాడ్ విషాదాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ.. జాతీయ విపత్తుగా ప్రకటించటానికి సంబంధించి ప్రత్యేకంగా ఎటువంటి నిబంధనలు లేవని పేర్కొన్నాయి. ఈ మేరకు 2013లో యూపీఏ ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్రమంత్రి ఎం.రామచంద్రన్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానాన్ని గుర్తు చేశాయి. ప్రకృతి విపత్తుల సమయంలో సహాయ పునరావాసాల బాధ్యత ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉంటుందని, అవసరాల మేరకు కేంద్రం సాయమందిస్తుందని నాడు మంత్రి చెప్పారు.

## తెలంగాణ పోరాటం తరహాలో.. బీసీల రిజర్వేషన్లకు ఉద్యమించాలి

- మొదటిపేజీ తరువాయి

మరుగునపడిందన్నారు. ఈ ఉద్యమాన్ని మరోసారి చేపట్టాల్సిన అవసరముందన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీలు మిలిటెంట్ తరహా ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. తనకు పార్టీలు, పదవులు ముఖ్యం కాదని, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తే తొలుత వ్యతిరేకించేది తానేనని అన్నారు. కులగణన, బీసీ రిజర్వేషన్లపై పార్లమెంటులో కేంద్రాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నిలదీస్తున్నా.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రం ఈ విషయాల్లో స్పష్టత లేదని జాజుల శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. అనంతరం రాజారాం యాదవ్ సహా పలువురికి ఆర్.కృష్ణయ్య నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.



# హైదరాబాద్‌లో జొయిటిస్, మోనార్క్ ట్రాక్టర్స్ విస్తరణ

- మొదటిపేజీ తరువాయి

సంరక్షణ రంగానికి ఉపయోగకరం అని.. శాటిలైట్ సెంటర్ ఏర్పాటునూ పరిశీలించాలని కోరారు. స్టాన్‌ఫర్డ్ బయో డిజైన్ సెంటర్ లాంటి ప్రపంచ స్థాయి విభాగాలు కలిసి వస్తే నైపుణ్యాభివృద్ధిలో తమ ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ఇది తెలంగాణకే కాక యావత్ ప్రపంచానికి ఆరోగ్య సంరక్షణలో కీలకంగా మారుతుందని పేర్కొన్నారు.

### మా లక్ష్యం నెరవేరుతుంది: శ్రీధర్‌బాబు

స్టాన్‌ఫర్డ్ సెంటర్‌తో.. స్కిల్, లైఫ్ సైన్సెస్ యూనివర్శిటీల లక్ష్యం నెరవేరుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణలో లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ పరిశ్రమల వృద్ధికి మరో ముందడుగు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రేవంత్ బృందం కాలిఫోర్నియా మౌంటైన్ వ్యూలో ఉన్న గూగుల్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో టెక్నాలజీ వినియోగం, తెలంగాణలో సాంకేతిక సేవల విస్తృతి, ఏఐ సిటీ నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు తదితర ప్రాజెక్టుల్లో భాగస్వామ్యంపై గూగుల్ ఉన్నతాధికారులతో చర్చలు జరిపింది. గూగుల్ సిబ్బందితో టెక్నాలజీ, ఏఐ, స్కిల్స్ తదితర అంశాలపై ముచ్చటించింది.

### జొయిటిస్, మోనార్క్ విస్తరణ..

జంతు ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రముఖ సంస్థగా పేరుపొందిన జొయిటిస్.. హైదరాబాద్‌లో వచ్చే సెప్టెంబర్ నుంచి సామర్థ్య కేంద్రం (క్యాపబులిటీ సెంటర్)ను విస్తరించాలని నిర్ణయించింది. అమెరికాలో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైన సంస్థ ప్రతినిధుల బృందం ఈ విషయాన్ని ప్రకటించింది. జొయిటిస్ నిర్ణయాన్ని




స్వాగతించిన సీఎం.. కొత్త ఆవిష్కరణలు, వ్యాపార వృద్ధికి తెలంగాణలో అపార అవకాశాలున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలనే తమ ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడతాయన్నారు. భవిష్యత్ టెక్నాలజీలో జొయిటిస్ రంగప్రవేశం హైదరాబాద్‌కు మరింత గుర్తింపు తెస్తుందని తెలిపారు. వందలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

భారత్‌లో తమ సంస్థ విస్తరణకు హైదరాబాద్ అనువైనదని, తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం సంతోషంగా ఉందని జొయిటిస్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సర్బాగ్ తెలిపారు. తెలంగాణలో ఉన్న ప్రపంచస్థాయి ప్రతిభా వనరులను సద్వినియోగం చేసుకుంటామని జొయిటిస్ ఇండియా సెంటర్ ఉపాధ్యక్షుడు అనిల్ రాఘవ్ తెలిపారు. హైదరాబాద్‌లోని తమ పరిశోధన-అభివృద్ధి (ఆర్అండ్‌డీ) సెంటర్‌ను విస్తరించే అంశంపై సీఎం రేవంత్ బృందానికి మోనార్క్ ట్రాక్టర్స్ ప్రతినిధులు లేఖ అందజేశారు. అమెరికాలో రేవంత్‌ను మోనార్క్ ట్రాక్టర్స్ సంస్థ ప్రతినిధులు కలిశారు. అనంతరం హైదరాబాద్‌లో ఆర్అండ్‌డీ సంస్థకు అనుబంధంగా స్వయంప్రతిపత్తి ట్రాక్టర్ టెస్టింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అధునాతన, పర్యావరణ అనుకూల సంస్థలను ఆకర్షించడంపై దృష్టిసారించామని, మోనార్క్ ట్రాక్టర్స్‌ను తెలంగాణకు ఆహ్వానిస్తున్నామని రేవంత్ తెలిపారు. స్వయంప్రతిపత్తి, ఎలక్ట్రిక్ వాహనాల సాంకేతికతలో తెలంగాణను అగ్రగామిగా నిలిపామని, ఆ విజన్‌లో మోనార్క్ ట్రాక్టర్స్ భాగమై రాష్ట్రంలో తమ ఉనికిని విస్తరించుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో కార్యకలాపాలపై చర్చించేందుకు రేవంత్ బృందాన్ని కలవడం సంతోషంగా ఉందని మోనార్క్ ట్రాక్టర్స్ సీఈవో ప్రవీణ్ పెన్మెత్స వెల్లడించారు.

## వచ్చే ఏడాది నుంచి రేషన్ సన్నబియ్యం

- మొదటిపేజీ తరువాయి



గ్రామీణ ప్రాంతాల్లో కార్డుల జారీకి సంబంధించి డాక్టర్ ఎన్.సి.సక్సేనా, సుప్రీంకోర్టు స్పెషల్ కమిషనర్‌గా పనిచేసిన హర్షమందర్ కమిటీ, పట్టణ ప్రాంతాల్లో కార్డుల జారీకి సంబంధించి హాషీమ్ కమిటీ ముసాయిదా నిబంధనలపై అధ్యయనం చేయాలని అధికారులను మంత్రివర్గ ఉప సంఘం ఆదేశించింది. రాష్ట్రంలో 65 లేదా ఆపైన వయసుండి, ఏ ఆదాయ వనరులు లేనివారికి అన్నపూర్ణ కార్డులు జారీ చేస్తున్నట్లు అధికారులు ప్రస్తావించారు. అర్హులందరికీ తెల్లకార్డులు జారీ చేస్తామన్న ఉత్తమ్.. సక్సేనా కమిటీ సిఫారసులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

సక్సేనా, హాషీమ్ కమిటీ సిఫారసుల ప్రకారం.. ఒంటరి మహిళలతో పాటు సామాజికంగా వెనుకబాటుకు గురైన వర్గాలకు, ఆదివాసీ గిరిజను (చెంచులు, కోలామ్స్, తోటి, కొండరెడ్లు)లకు, భూమి లేని వ్యవసాయ కూలీలు, అసంఘటిత కార్మికులు, ప్రత్యేక వైకల్యం ఉన్నవారికి అన్నపూర్ణ అంత్యోదయ కార్డులు ఇవ్వాలి. ఇప్పటికే జారీ చేసిన కార్డుల్లో కొత్త సభ్యుల (16,36,687) చేర్పునకు వచ్చిన 11,33,881 దరఖాస్తులను ఆమోదిస్తే రూ.495 కోట్లు, కొత్త కార్డులకు వచ్చిన 10 లక్షల దరఖాస్తుల (31.60 లక్షలమందికి సంబంధించి)ను ఆమోదిస్తే ఏటా రూ.956 కోట్ల భారం పడనుంది.

### 80 శాతం కుటుంబాలకు తెల్ల కార్డులు

రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం కుటుంబాలు 83,03,612 కాగా.. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 1,03,95,629గా తేలాయి. తాజాగా 1,11,23,323కు పెరిగాయి. ఈ ప్రకారం 80.88 శాతం కుటుంబాలకు (89,96,579) తెల్ల కార్డులు ఉన్నాయి. దేశంలో రేషన్ కార్డులు పొందడానికి వార్షికాదాయం అత్యధికంగా ఉన్న రాష్ట్రం కేరళ అని.. అక్కడ రూ.3 లక్షల లోపు ఉన్నవారిని బీపీఎల్‌గా గుర్తించి, కార్డులు ఇస్తున్నట్లు మంత్రివర్గ ఉపసంఘం గుర్తించింది.



## తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని విమానాశ్రయాలు

- మొదటిపేజీ తరువాయి

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నేడు ప్రపంచంలో పదో, దేశంలో నాలుగో అతిపెద్ద విమానాశ్రయంగా అవతరించిందని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అన్ని విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇప్పటికే 28 శాతం పనులు పూర్తయిన భోగాపురం విమానాశ్రయాన్ని పూర్తి చేసి త్వరలోనే అందుబాటులోకి తేవడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. విమానాశ్రయాల్లో ప్రయాణికులతో భద్రతా సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ప్రధాని మోదీ శ్రీకారం చుట్టిన 'అమ్మ పేరుతో ఓ చెట్టు' కార్యక్రమంలో భాగస్వాములు కావడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. సెప్టెంబరు వరకు దేశవ్యాప్తంగా 80 కోట్ల మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటి సంరక్షిస్తామంటూ అధికారులు, భద్రతా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. 10కే మారథాన్‌లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ ఫణికర్, విమానాశ్రయ భద్రతాధికారులు రమ్యభారతి, శివకుమార్, శంషాబాద్ ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కు ఫ్యాక్టరీపై ఒత్తిడి తేవాలి

**బయ్యారంపై బీజేపీ ఎంపీలు స్పందించాలి**

**మల్కాన్‌గిరి రైల్వేలైన్‌తో ఐరన్ ఓర్ తరలింపు సులభం**

**రైల్వేలైన్లకు అనుగుణంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి : వినోద్**

హైదరాబాద్, ఆగస్టు 10: కేంద్రం కొత్తగా మంజూరు చేసిన పాండురంగాపురం-మల్కాన్‌గిరి కొత్త రైల్వేలైన్ బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ అవసరాలు తీర్చేలా ఉన్నదని, కేంద్రం ఇప్పటికైనా బయ్యారంలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, ఇందుకోసం తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్‌చేశారు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీకి అవసరమైన ఐరన్‌ఓర్‌ను తరలించేందుకు ఈ రైల్వేలైన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కొత్త రైల్వేలైన్, ఐరన్‌ఓర్‌ను గుజరాత్‌కు తరలించే ఆలోచన చేయడం తగదని సూచించారు. ఇక్కడ రైల్వేలైన్లకు అనుగుణంగా మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు.

శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ ఖమ్మం నేత దిండిగల రాజేందర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కేంద్ర క్యాబినెట్ శుక్రవారం




173 కిలోమీటర్ల పాండురంగాపురం (భద్రాచలం)-మలాన్‌గిరి రైల్వేలైన్‌కు అనుమతి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, ఇది మంచి లైన్ అంటూ అభివర్ణించారు. ఈ రైల్వేలైన్‌ను తెలంగాణ ఓ కోణంలో వినియోగించుకోవాలని ఆలోచిస్తుంటే మోదీ మరోకోణంలో ఆలోచిస్తున్నారని తెలిపారు. 'బయ్యారం ఉకు తెలంగాణ హకు' అనే నినాదంతో ఉద్యమం కొనసాగిందని, విశాఖ కంటే బయ్యారానికే ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్లా దగ్గరవుతుందని, బయ్యారానికి రైల్వేలైన్ చాలా కీలకమైందని, ఎన్ఎండీసీ అధికారులు ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుకు రైల్వేలైన్ కావాలని అడిగారని, దీనిద్వారా ఫ్యాక్టరీకి ప్రధాన రవాణా సౌకర్యం కలుగుతుందని చెప్పారు.

2017లో కేంద్రం ఉకు పాలసీ ప్రకటించిందని, 2030 నాటికి తలసరి ఉకు వినియోగాన్ని ప్రతి వ్యక్తి 158 కిలోలు వాడే విధంగా ప్రోత్సహించాలని నిర్ణయించిందని గుర్తుచేశారు. బయ్యారంలో తెలంగాణ స్టీల్ ప్లాంట్ పెడితేనే తలసరి వినియోగ అవసరాలను తీర్చేలా ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. కొత్త రైల్వేలైన్ ఖనిజ సంపదను గుజరాత్ తరలించేందుకు ఉపయోగపడేదిగా మారకూడదని తెలిపారు. బయ్యారం లో మూడు మిలియన్ టన్నుల ఉకు ఉత్పాదక ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని గతంలోనే స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదించిందని, ఈ ఫ్యాక్టరీ వస్తే నాలుగు వేల మందికి ప్రత్యక్షంగా, పదివేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. పదేండ్లుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా తెలంగాణలో భారీ పరిశ్రమలకు మోదీ పది పైసలైనా ఇచ్చారా? అంటూ ప్రశ్నించారు.

# మన పూర్వికులను మన కుల పెద్దలను మనం గౌరవించు కుంటేనే రేపు రాబోయే తరం మనను గుర్తింస్తుంది గౌరవింస్తుంది







హైదరాబాద్: మన పూర్వికులను మన కుల పెద్దలను మనం గౌరవించు కుంటేనే రేపు రాబోయే తరం మనను గుర్తింస్తుంది గౌరవింస్తుంది. మన కుల పెద్దలను గౌరవించుకొని వారి జయంతి ,వర్ధంతి కర్యక్రమాలు చేయండి. అన్ని కుల సంఘాలు , ట్రస్టు బోర్డు అయినా – బ్యానర్, ఫేక్సిల పైన తప్పకుండా మన కుల పెద్దల ఫోటోలు ఉండాలి. మన సంఘాలలో ఎవరికీ ఇష్టం వచ్చినట్టు వాళ్ళు రకరకాల మన కుల లోగోలు పెడుతున్నారు అది తప్పు అన్ని సంఘాల లోగోలు ఒకే విధంగా ఉండాలి...మన కులానికి మన కుల పెద్దలు నిర్ణయించిన లోగోలు ఉన్నాయి. అలాగే ట్రస్టు అద్వర్యంలో ఏలాంటి సహాయం కార్యక్రమలు చేపట్టిన అకార్యక్రమాలకు మన కుల పెద్దల పేరు ఉండాలి.

విద్యార్థి వసతి గృహం, ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ
నగదు ప్రతిభా పురస్కారములు
బుక్– బ్యాంక్ సౌకర్యం
స్కూల్/ కాలేజీ ఫీజు చెల్లింపు
వైద్య ఆరోగ్య కేంద్రం
నైపుణ్యం శిక్షణా కేంద్రం/ వృత్తి శిక్షణ కేంద్రము

నోటు బుక్స్‌పైన మన కుల పెద్దల ఫోటోలు పెట్టి గౌరవించు కుందాము. అలాగే మన మున్నూరు కాపుల ఐక్యత కోసం, అభివృద్ధి కోసం, పేద విద్యార్థుల కోసం మరింత చోరవ తీసుకోవాలి. అలాగే హస్టల్‌లో ఉన్న విద్యార్థుల కోసం కనీస సౌకర్యాలు కల్పించాలి. అలాగే పూంజల శివశంకర్ చోరవతోనే ఈ ట్రస్టు ఏర్పడింది.ఈ ట్రస్టు బోర్డు ను కపాడుకోవలసిన భధ్యత మన అందరిదీ..అలాగే మన రాబడి పెంచుకోవాలి. మనకు అచివర నుండి ఈచివర వరుకు వరసగా మాడిలు షాపులు ఉన్నాయి. అవి పాత రేంట్లు ఉన్నాయి ..వాళ్ళ రేంట్లు పెంచాలి..అవి పాత రేంట్లు.. లేకుంటే కాళీ చేయించి వేరే వారికి ఇవ్వండి. ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా ట్రస్టు బోర్డు సభ్యులకీ మహాసభ కర్యవర్గ సభ్యులకి హృదయ పూర్వక దాన్యావాదాలు. దయచేసి సంఘం లో కొట్లాలు కేసులు బంద్ చేయండి.. యువతను ప్రొత్సహించండి.. ఈరోజు శివ శంకర్ జయంతి ఉత్సవాలు అందరూ ఒక్క కాడ జరిపి ఉంటే సమాజానికి ఒక చక్కటి సందేశం ఇచ్చి ఉండేవారు, కానీ అది జరగలేదు. రాష్ట్రంలో ఒకే సంఘం ఒకే అధ్యక్షుడు ఉండాలి. కులానికి ట్రస్టు బోర్డు కి మంచి పేరు తీసుకుని రావాలని కోరుకుంటు సేలువు తీసుకుంటున్నా మీ ఆవుల రమేష్.



## ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషనుకు రాచకొండ సీపీ సుధీర్ బాబు

ఇబ్రహీంపట్నం: ఆగస్టు8 (వాయిస్ టుడే) రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసు స్టేషన్లలో అధికారులు మరియు సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి రాచకొండ సీపీ సుధీర్ బాబు శనివారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషనును, ఇబ్రహీంపట్నం ఏసిపి కేపీవి రాజుతో కలిసి సందర్శించారు. స్టేషన్లోని రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సీఐ సత్యనారాయణ, ట్రాఫిక్ సిఐ గురువయ్య, ఎస్ఐలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## ఆలయాల నిర్వాహకులకు బోనాల చెక్కులను అందచేసిన ఎంపీఆర్



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):– బోనాలను పురస్కరించుకుని ఉప్పల్ నియోజకవర్గంలోని ఆలయాల నిర్వాహకులకు మందుముల పరమేశ్వర్ రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి నియోజకవర్గంలోని గతంలో ఎన్నడూ కూడా బోనాలకు డబ్బులు రాని ఆలయాల వివరాలను రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ దృష్టికి తీసుకెళ్లి కావాల్సిన నిధులను మంజూరు చేయించారు. ఉప్పల్ లో శనివారం పరమేశ్వర్ రెడ్డి ఆలయాల నిర్వాహకులకు చెక్కులను అంద చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టిలో ఏబిసిడి వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

**ఏకలవ్య కార్పొరేషన్ కి బడ్జెట్ కేటాయించాలి**

**తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు**




సికింద్రాబాద్, ఆగస్టు 10 (వాయిస్ టుడే ప్రతినిధి): సుప్రీంకోర్టు తీర్పు ఆదేశాల మేరకు ఎస్టీ లో ఏబిసిడి వర్గీకరణ వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివాసి ఎరుకల జాతి విద్యా ఉద్యోగ ఉపాధి ఆర్థిక రాజకీయంగా వెనుకబడి ఉన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. శనివారం సికింద్రాబాద్ లోని ఓ హోటల్లో తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం, తెలంగాణ ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రొఫెసర్లు మేధావులు ఉద్యోగులు 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని ఏకలవ్య కార్పొరేషన్ కి 1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం అధ్యక్షులు లోకిని రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎస్సీ ఎస్టీ వర్గీకరణ పైన సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం గౌరవించి వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ ను కమిటీ సభ్యులను వెంటనే నియమించాలని కోరారు. ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ సదానందం మాట్లాడుతూ అర్హులైన నిరుపేద ఆదివాసి ఎరుకల కుటుంబాల అభివృద్ధి కోసం బ్యాంకు తో సంబంధం లేకుండా 100% సబ్సిడీతో 10 లక్షల రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రూప్స్ ఉద్యోగాల్లో అవకాశాలు పొందడానికి కాంపిటీషన్ పరీక్షల్లో ఉత్తీర్ణత కావడానికి హైదరాబాద్ కేంద్రంగా ఏకలవ్య స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. అలానే ట్యాంక్ బండ్ పై ఏకలవ్యుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆదివాసి ఎరుకల సామాజిక వర్గాన్ని గుర్తించి ఎమ్మెల్సీలుగా నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘం ప్రతినిధులు కూతాడి రవికుమార్, కోనేటి నరసింహ, వనం రమేష్, కేసారం నాగులు, శ్రీరామ్, ఆనంద్, కోనేటి రాజు, కేతిరి రాజశేఖర్, కోనేటి సమ్మయ్య, కూరాకుల శ్రీనివాస్, పాత పల్లి నరసింహ, సాయి, మొగులయ్య, ఆర్ సత్యనారాయణ తో పాటు 36 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# చిల్కానగర్ డివిజన్‌లో 54 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):– చిల్కానగర్ డివిజన్ లో 54 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్ల పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్లో గత మూడున్నర సంవత్సరాలలో సుమారు 75 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఆనాటి చిల్కానగర్ కి ఇప్పుడున్న చిల్కానగర్ కి ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. టిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా ఉండి డివిజన్లోని అన్ని ప్రాంతాలలో ఎటువంటి సమస్య లేకుండా తమ దృష్టికి తీసుకువచ్చి పనులు పూర్తి చేస్తున్నందుకు వారిని నేను అభినందిస్తున్నానని అన్నారు. డివిజన్ కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో డివిజన్ ని మరింత అభివృద్ధి చేసే అవకాశం దొరికినందుకు, నా వెంట ఉండి నాకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తున్న చిల్కానగర్ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా డివిజన్లోని కొన్ని ప్రాంతాలలో సీవరేజ్ పైప్ లైన్ వేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వారి సహకారంతో అవన్నీ కూడా దశలవారీగా పనులు పూర్తి చేస్తానని కార్పొరేటర్ గీతా ప్రవీణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ,సీనియర్ నాయకులు వి బి నరసింహ, ఎద్దుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోల్కొండ జగన్, సీనియర్ నాయకులు వాస్ ,పిట్టల నరేష్ , చీర్యాల శ్రీని,మాస శేఖర్, నర్సింగ్ రావు, పండ్ల కిషన్, మహమూద్, ముద్దం శ్రీనివాస్, గూడూరు రమేష్, అల్లిబిల్లి మహేందర్, యాదగిరి, పోచయ్య, బాలు, షఫీ, హనీఫ్, గౌస్, శంకరన్న, అశోక్ చారి, జిల్లాల ప్రవీణ్ బాలేందర్, కుమార్ ,నర్సింగ్ నేత, సుందర్, పాపి రెడ్డి, బాబు,ప్రసాద్ చారి , నరసింహ చారి,కిరణ్, ఆటో బాలు, సుభద్ర, ఆండాలు, శైనాజ్, అనసూయ ,లక్ష్మి ,సత్యవతి, ఉమా ,శారద, మరీము పెద్ద ఎత్తున మహిళలు బస్తీ వాసులు మొదలగు వారు పాల్గొన్నారు.



## మాజీ కేంద్ర మంత్రి పుంజాల శివశంకర్ 95వ జయంతి వేడుకలు

హైదరాబాద్: మున్నూరుకాపు సంఘం తెలంగాణ మరియు మున్నూరుకాపు యువత ఆధ్వర్యంలో యువత గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు చామల లవ కుమార్ పటేల్ అధ్యక్షతన పుంజాల శివశంకర్ 95 జయంతి వేడుకలు హైదరాబాద్ ట్యాంక్ బండ్ పైన ఘనంగా నిర్వహించారు. బడుగు బలహీన వర్గాల వారికి అండగా ఉండి చేసిన అనేక సేవలను , బీసీ వర్గాల కోసం వారు పోరాడిన కృషి విధానాలను, వారి ఆశయాలను గుర్తు చేసుకుంటూ అలాగే వారు మాజీ గవర్నర్ గా మాజీ కేంద్ర మంత్రిగా కాంగ్రెస్ పార్టీలో అనేక సేవలు అందించడం జరిగింది అలాంటి మహనీయుని విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పైన ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ మరియు మున్నూరుకాపు యువత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి మహనీయుల గురించి తెలుసుకొని బీసీ యువత ముందుకు నడవాలని లేకపోతే మన ముందు తరాల వాళ్ళకి ఇలాంటి మహనీయుల గురించి తెలియకుండా పోతుంది అని గుర్తు చేసుకోవడం జరిగింది. కార్యక్రమం అనంతరం పేదవాళ్ళకి శివశంకర్ జయంతి సందర్భంగా ఫుడ్స్ పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్ కుమార్ పటేల్ మరియు మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వనమాల ప్రవీణ్ కుమార్ పటేల్, మరియు రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్, యువత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాద క్రాంతి పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి అనిల్ పటేల్,సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇమిడిశెట్టి మోహన్ పటేల్, , మున్నూరు కాపు సంఘం రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్ ఎర్రం సంజీవ్ పటేల్ మరియు అతిథిగా డాక్టర్ బాల శ్రీనివాస్ పటేల్ తెలంగాణా మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు మరియు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు) మున్నూరు కాపు యువత సికింద్రాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మామిడాల బాలకృష్ణ పటేల్, అంబర్ పేట నియోజకవర్గ ఇన్చార్జ్ వీరేశ్ పటేల్, ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ సాయి పటేల్, బంజారాహిల్స్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీనివాస్ పటేల్, ఆకుల వెంకట్రావ్ పటేల్ (తెలంగాణా మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు మరియు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు) వెంకటాపురం రాజేందర్ పటేల్ సర్పంచ్,జక్కుల గజేందర్ పటేల్ అడ్వకేట్ పాల్గొన్నారు.



## ఉత్తమ సేవలకు.. డాక్టరేట్ అందుకున్న మంద సంజీవరెడ్డి

**గౌరవ డాక్టరేట్‌తో సన్మానించిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ**

వాయిస్ టుడే న్యూస్, ఆగస్ట్ 10 బోడుప్పల్ : ప్రజాసేవలో అలుపెరుగని సేవలు అందించినందుకు గాను, రాజకీయాల్లో ప్రజల నుంచి మన్ననలను పొందినందుకు గాను తెలంగాణ రాష్ట్ర మాజీ పొల్యూషన్ బోర్డు మెంబర్ బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఘట్కేసర్ మాజీ జడ్పిటిసి మంద సంజీవరెడ్డికి అరుదైన గుర్తింపు లభించింది. ఈ మేరకు శనివారం పుదూచేర్రీ లో ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా మంద సంజీవ రెడ్డి మాట్లాడుతూ డాక్టరేట్ అందజేసి గౌరవించిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ సభ్యులకు ధన్యవాదాలు అని, ప్రజా సేవలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను అవార్డును అందజేశారని అన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని ఇచ్చినందుకు ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని మంద సంజీవరెడ్డి అన్నారు.



## పాలమూరును అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి జూపల్లి కృష్ణారావు: బోరెల్లి సురేష్

సికింద్రాబాద్, ఆగస్ట్ 10 (వాయిస్ టుడే ప్రతినిధి): పాలమూరు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి అపర భగీరథుడు రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ అన్నారు. ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావు పుట్టినరోజు వేడుకలను బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా పచ్చబడడానికి, వలసలను అరికట్టి, అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి కారణం జూపల్లి కృష్ణారావు అని కొనియాడారు. జూపల్లి ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా సస్యశ్యామలం అయిందని అన్నారు. పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసిన జూపల్లి కృష్ణారావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నరసింహ, మండ్ల రవి, దేవరకొండ నరేష్, కల్వకుర్తి శ్రీశైలం, భిక్షం, ఆరె కంటి శ్రీకాంత్, మధు, రేవంత్, చింటూ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
ఆదివారం, 11 ఆగస్టు 2024

## సీఎం రేవంత్ రెడ్డి బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారు: జాజుల లింగంగౌడ్



సికింద్రాబాద్,ఆగస్టు10 (వాయిస్ టుడే ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపించడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ అధికారులకు ప్రాధాన్యత లేని శాఖలు కేటాయించడం అన్యాయం అన్నారు. ఈ మేరకు ఓయూలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటివరకు బీసీలను చిన్నచూపు చూస్తూ రెండు మూడు కులాలకే ప్రాధాన్యతనిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తెలంగాణలోని అన్ని శాఖలలో కులవివక్షత కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని అర్హతలు, సీనియారిటీ ఉన్న బీసీ అధికారులు ఉన్నప్పటికీ పదోన్నతులు, పోస్టింగ్ విషయాలలో ప్రాధాన్యత లేని పోస్టులకే పరిమితం చేస్తూ రెండు మూడు కులాలకే అగ్రతాంబూలం వేస్తూ వారికే కీలక పోస్ట్ లు ఇస్తున్నారని దుయ్యబట్టారు. సామాజిక న్యాయం అంటూ రాజ్యాంగం చేతిలో పట్టుకొని రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకే కులానికి అగ్ర తాంబూలం వేస్తున్నాడన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మెజార్టీగా ఉన్న బీసీలను గుర్తించి భవిష్యత్తులో జరిగే బదిలీల్లో సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



## ఒంటరి మహిళలను టార్గెట్ చేసి దోచుకుంటున్న దంపతుల అరెస్ట్

సికింద్రాబాద్, ఆగస్టు 10 (వాయిస్ టుడే ప్రతినిధి): ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకొని దోపిడీలకు పాల్పడుతున్న దంపతులను లాలాగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ మేరకు శనివారం లాలాగూడ పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి హాజరై వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లాలోని త్రిపూరారం మండలం చెన్నైపాలెంకు చెందిన నేనావత్ హరి నాయక్(45) కొంతకాలం క్రితం నగరానికి వలసొచ్చాడు. వడ్డేపల్లి లక్ష్మి (40) ఆలియాస్ కవిత అనే మహిళతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ సహజీవనం సాగిస్తున్నారు . హస్తినపురంలోని రాఘవేంద్ర హోటల్ సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన ఈ దంపతులు ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తూ దోపిడీలు చేస్తుండేవారు. ఈ క్రమంలో ఆగస్టు 3వ సాయంత్రం 6 గంటల సమయంలో అత్తాపూర్ లోని ఓ కల్లుకంపౌండ్ కు వెళ్లిన ఈ దంపతులు అక్కడ ఒంటరిగా ఉన్న ఆచ్చమ్మ అనే మహిళతో మాట కలిపారు. పని ఇప్పిస్తామని చెప్పి అచ్చమ్మను ఆటో ఎక్కించుకొని నార్త్ లాగూడలోని రైల్వే మద్దూర్ యూనియన్ కార్యలయం సమీపంలోని మహంకాళి ఆలయం వద్దనున్న ఖాళీ ప్రదేశానికి తీసుకొచ్చారు. అనంతరం, అచ్చమ్మను చంపేస్తామని బెదిరించి ఆమె వద్దనున్న నల్లపూసలు, బంగారు గొలుసు, చెవి కమ్మలు, ముక్కుపుడక, మెట్టెలు (మొత్తం రూ.30 వేల విలువగల 12 గ్రాముల బంగారు నగలు, 3 తులాల వెండి ఆభరణాలు) లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అత్తాపూర్ నుంచి లాలాగూడ పోలీపే స్టేషన్ వరకు ఉన్న సీసీ కెమెరాలను పూర్తిగా పరిశీలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగిలించిన సొత్తును సికింద్రాబాద్ పాట్ మార్కెట్లోని శ్రీ స్వతంత్ర జ్యువెల్లర్స్, శ్రీ లక్ష్మీనారాయణ జ్యువెల్లర్స్ యజమానులు సంజయ్ ఉపాధ్యాయ్, ప్రవీణ్ కుమార్ లకు విక్రయించినట్లు గుర్తించారు. వారి వద్దకు వెళ్లి విచారించి శనివారం ఉదయం క్రైమ్ ఎస్ఐ నాగరాజు నేతృత్వంలో పలువురు కానిస్టేబుళ్లు నిందితులు హరి నాయక్, వడ్డె లక్ష్మిలను హస్తినపురంలోని నందనవనం కాలనీలో అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 7 గ్రాముల బంగారు నగలు, 23 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. అదే విధంగా దొంగలించిన సొత్తును కొనుగోలు చేసిన జ్యువెల్లరీ షాపు యజమానులపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడు హరి నాయక్ పై ఇది వరకు 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 7 పోలీస్ స్టేషన్ లలో 10కి పైగా కేసులు నమోదై ఉన్నాయని వివరించారు.



## అభివృద్ధిని నిర్మాణ పనుల్లో నాణ్యత ఎలాంటి లోపాలున్నా చర్యలు తీసుకోవాలి

### కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి, ఆగస్టు 10(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి నాణ్యత నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపాలున్నా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అధికారులను హెచ్చరించారు.కూకట్ పలి నియోజకవర్గ పరిధిలోని మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ ఇందిరాగాంధీ పుర%శీ% పరిధిలో రూ. 60 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను అయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతల పాటించాలని, లేని ఎడల సంబందిత కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు డివిజన్ అధ్యక్షుడు స్థానిక నాయకులు రహదారి నిర్మాణంలో నాణ్యత లోపంతో జరుగుతుందని రమేష్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బండి రమేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. అదేవిధంగా నిర్మాణ పనులను పర్యవేక్షణలో సర్కిల్ అధికారులు ఈఈ శ్రీనివాస్, డిఈ ఆనంద్, ఏఈ పవన్ లతో ఫోన్ లో మాట్లాడి రహదారి నిర్మాణ నాణ్యతపై ప్రశ్నించారు. దీనిపై క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ తమకు అందజేయాలని సూచించారు. ఆదే విధంగా బస్తిలోని మంచినీటి సమస్యపై స్థానికులను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్ గృహప్రవేశానికి వెళ్లి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు అంతకు ముందు కాంగ్రెస్ నాయకుడు సాధు ప్రతాపరెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# నియోజకవర్గం పరిధిలోని అన్ని రంగాలలో అభివృద్ధి పరచి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

### ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



శేరిలింగంపల్లి, ఆగస్టు 10(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ పరిధిలోని సైబర్ విలేజ్, సైప్రస్ విల్లాస్, సైబర్ వ్యాలీ, కృష్ణ కాలనీ, శిల్ప పార్క్,మరియు మై స్కేప్ సంక్చరీ కాలనీలలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పర్యటించి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు కాలనీల వాసులు మాట్లాడుతూ కాలనీల లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని కాలనీలలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, ప్రధాన రహదారి నుండి వచ్చే వాహనాలు కాలనీల అంతర్గత రోడ్లు ఉపయోగించడం వలన కాలనీ వాసులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, అవసరమున్న చోట్ల రోడ్ల ను విస్తరించాలని, పాదాచారులకు ఇబ్బంది కలగకుండా ఉండదుకు ఫూట్ ఫాత్ లు నిర్మించాలని, అవసరమున్న చోట ఫూట్ ఫాత్ లను ఏర్పాటు చేయాలని, అక్రమ పార్కింగ్ వ్యవస్థను నివారించాలని, సీనియర్ సిటీజన్ పార్క్ లో కూర్చువడానికి విలుగా ఒక సమావేశ మందిరం నిర్మించాలని, డ్రైనేజి వ్యవస్థ మెరుగుపరచడానికి నాలాపై బాక్స్ కల్వర్ట్ ను నిర్మించాలని, సైబర్ విలేజ్ నుండి వచ్చే డ్రైనేజి ని శిల్ప పార్క్ డ్రైనేజి పైప్ లైన్ కు అనుసంధానం చేయాలని, సైబర్ విలెజ్ మరియు కృష్ణ కాలనీ లలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని విధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడలని, పారిశుధ్యం పనులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, కుక్కల బెడద నుండి రక్షించాలని ఎమ్మెల్యే గాంధీకు కాలనీ వాసులకు విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ మీ అందరి సమిష్టి కృషి తో కాలనీలను ఒక ఆదర్శవంతమైన కాలనీలు తీర్చిదిద్దుతామని, కాలనీల అభివృద్ధికి ప్రతి ఒక్కరు బాగస్వామ్యం కావాలని, కాలనీలలో నెలకొన్న అన్ని సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని, కాలనీ లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తానని, అవసరమున్న చోట ప్రత్యామ్నాయ మార్గాలను చూడలని ట్రాఫిక్ అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తామని,మెరుగైన ,సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. కాలనీ లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కృషి చేస్తామని, తన వంతు సహయ సహకారాలు ఉంటాయి అని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. డ్రైనేజి సమస్య కు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, నాలలో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడలని, అసంపూర్తిగా మిగిలిపోయిన యుజిడి పనులను మరియు రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తామని,మంజీర మంచీ నీటి వసతిని మెరుగుపరుస్తామని, దశల వారిగా అన్ని పనులు పూర్తి చేసికాలనీ లో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. అదేవిధంగా కాలనీ లలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని , ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని ఎమ్మెల్యే గాంధీ చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ అడిషనల్ ఇన్స్పెక్టర్ నాగరాజు, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, సాంబశివరావు, కృష్ణ ,సత్యం అంకారావు, బృందరావు, నర్సింగ్ యాదవ్, బుజ్జన్న ,రాజు కాలనీ వాసులు నవీన్,సూర్యం, %ాదీ% రెడ్డి, జయప్రకాష్ రెడ్డి,కిరణ్ కుమార్, కృష్ణ రావు, శ్రీధర్ ,పాండు, యాదగిరి రెడ్డి, కిషోర్, సురేష్, రాము మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తప్పవు

### శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



కూకట్‌పల్లి, ఆగస్టు 10(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కలిసి పిర్యాదు చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మూడు సార్లు ప్రజల మద్దతుతో భారీ మెజారీతో గెలుపొందిన తాను ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంటే కొందరు అధికారులు ప్రోటోకాల్ ఉపల్లంగిస్తే ప్రోటోకాల్ పనులు చేయకుండా పబ్బం గడుపుతున్నారని పిర్యాదు చేశారు. ప్రభుత్వం చేపట్టే పనులు కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతుంటే ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడాన్ని ఎమ్మెల్యే కృష్ణారావు స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు సానుకూలంగా స్పందించిన స్పీకర్ వెంటనే ప్రోటోకాల్ సంబంధిత విభాగాల ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడి శాసనసభ్యుడి హక్కులకు భంగం కలిగించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ఉల్లంఘనలు పునరావృతం మైతే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఘనంగా న్యాయమూర్తి, మాజీ కేంద్ర మంత్రి పుంజాల శివశంకర్ 95వ జయంతి వేడుకలు



కూకట్‌పల్లి, ఆగస్టు 10(వాయిస్ టుడే) మాజీ కేంద్రమంత్రి మరియు మాజీ గవర్నర్ గుంజల శివశంకర్ 95వ జయంతి సందర్భంగా శేరిలింగంపల్లి కూకట్ పల్లి నియోజకవర్గాలలో ఘనంగా జయంతి ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పర్వతనేని సతీష్ కుమార్, చింతల వెంకటస్వామి, భక్తుల రాంనర్సయ్య, మందుల మల్లయ్య, ఆది సంజీవ, తేళ్ల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## న్యాయవాదులపై దాడి చేసిన జనగాం పోలీసుల తీరుపై డీజీపీకి ఫిర్యాదు చేసిన అడ్వకేట్ బృందం

కూకట్పల్లి : ఆగస్టు,10(వాయిస్ టుడే) జనగామ,సిద్దిపేట,సిరిసిల్ల,సూర్యాపేట,మల్కాజిగిరి, వేములవాడ వేరు వేరు ప్రాంతాలలో పోలీసులు న్యాయవాదులపై ప్రదర్శించిన తీరు,దాడులు అక్రమ కేసులు వంటి సంఘటనలపై తెలంగాణ రాష్ట్రంలోని వివిధ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లతో కలిసి రాష్ట్ర డీజీపీని కలిసి ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో భాదింపబడే వారి పక్షాన అహర్నిశలూ న్యాయ పోరాటం చేస్తున్న న్యాయవాదులపై ఇలాంటి దాడులు జరపడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచి పరిణామం కాదని వివరిస్తూ,ఇప్పటివరకు జరిగిన సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చొరవ చూపాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర వివిధ కమిషనరేట్లకు ఆదేశాలు , సర్కులర్స్ ,జారీ చేయమని తెలంగాణ రాష్ట్ర డిజిపిని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు క్రాంతి కుమార్,రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ వై కొండల్ రెడ్డి,నాంపల్లి బారసోసియేషన్ ప్రెసిడెంట్ జి రాజవర్ధన్ రెడ్డి, కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. వి రాజకుమార్, థరూర్ బారాసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రామకృష్ణ, సిరిసిల్ల వేములవాడ బార్ అసోసియేషన్ సభ్యులు, వేణు, రవీందర్, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్దులకు దుప్పట్లు, పండ్లు పంపిణి

ఇల్లందకుంట ఆగస్టు 10 (వాయిస్ టుడే): మండలంలోని సీతంపేట గ్రామంలో పరంజ్యోతి సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు మరియు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ పరంజ్యోతి భగవతి పద్మావతి అమ్మవార్ల జన్మదినం సందర్భంగా పక్షం రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు మరియు పండ్లు పంపిణీ చేశారు ఈ సేవా భాగ్యాన్ని ఇచ్చిన పరంజ్యోతి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## మెరిట్ విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం ప్రభుత్వ పాఠశాలలలో మండల స్థాయిలో పదవ తరగతి మెరిట్ విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. మండల స్థాయిలో పదవ తరగతి విద్యార్థులకు సన్మానం చేసి మెమొంటో అందజేశారు.విద్యార్థుల నృత్యాలు అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సెక్యులరిజం అనే పదం ప్రజల గుండెల్లో ఉన్నది



## ఇంటిపై జాతీయ జెండా ఎగురవేద్దాం.. దేశ ఐక్యతను చాటి చెబుదాం

### బిజెపి నేతలు బాస సత్యనారాయణ రావు, గుగ్గిల్లపు రమేష్

కరీంనగర్ ఆగష్టు 10(వాయిస్ టుడే )ప్రధాని మోదీ మన్ కి బాత్ సందర్భంగా ప్రతి ఇంటిపై "హర్ ఘర్ తిరంగా" జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈనెల 11 నుండి 15 వరకు తలపెట్టిన హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు భాస సత్యనారాయణ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళపు రమేష్ పిలుపునిచ్చారు. శనివారం రోజున బిజెపి కరీంనగర్ పట్టణ ( 2) ముఖ్య కార్యకర్తల సమావేశం ఇన్చార్జి గుంజేటి శివకుమార్ ఆధ్వర్యంలో గోదాం గడ్డ లోని మనీష్ బంకిట్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇళ్ళ మీద జాతీయ జెండాను ఎగురవేసి , సెల్ఫీ తీసుకొని హర్ గర్ తిరంగా. కామ్ లో అప్లోడ్ చేసి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారాన్ని చేపట్టాలని కోరారు. దేశాన్ని ఒకటి చేసే ఈ అద్భుత కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై, దేశ ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పాలని , ఇందుకోసం బిజెపి శ్రేణులు కూడా తగిన కృషిచేసి ప్రోగ్రాం ను విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఇట్టి సమావేశంలో , జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం వాసు రెడ్డి, కార్పొరేటర్ కాసర్ల ఆనంద్, తణుకు సాయి, పురం హరి, సురేష్, బూత్ అధ్యక్షులు, ,శక్తి కేంద్ర ఇన్చార్జ్లు , జిల్లా , రాష్ట్ర నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## తన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితుడు ఆందోళన

### అర్ధరాత్రి పంట పొలం నాశనం చేసి దారి వేసుకున్నారని ఆరోపణ

### న్యాయం జరిపించాలంటూ అధికారులకు విన్నపం



హుజూరాబాద్ ఆగస్టు 10 (వాయిస్ టుడే): హుజురాబాద్ లోని వరంగల్ రోడ్ హెచ్ పీ పెట్రోల్ పంపు ఎదురుగా గల పాండ్రాల నాగరాజు సర్వేనెంబర్ 2420 లోగల 21 గుంటల వ్యవసాయ భూమి ఉండగా అందులో మూడు గంటల భూమిని బిఎస్సార్ గార్డెన్ వారు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హుజరాబాద్ లో నివాసం ఉంటున్న నాగరాజు తన భూమిని గతంలో కూడా ఇదే విధంగా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే కోర్టును ఆశ్రయించానని, కోర్టు తీర్పు కూడా తనకే సానుకూలంగా ఉందని నాగరాజు చెప్పుకొచ్చారు. దీంతోపాటు గత 15 రోజుల క్రితం హుజురాబాద్ ఆర్డిఓ, ఎంఆర్ఓలతో సర్వే జరిపించి కబ్జాకు ప్రయత్నించిన భూమి తనకే చెందుతుందని వారు కూడా దగ్గరుండి హద్దులు చూపించి వెళ్లారని అన్నారు. అనంతరం తమకు సంబంధించిన భూమిలో నాటు కూడా వేశామని అన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఎవరు లేని సమయంలో తాము వేసిన పంట పొలం నాశనం చేస్తూ తిరిగి ఫంక్షన్ హాల్ కు టిప్పర్లతో మట్టి పోయించారని ఆవేదన వ్యక్తం చేశాడు. బిఎస్ఆర్ గార్డెన్ వారికి ఎలాంటి ఆధారాలు లేకున్నా తమ భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బిఎస్ఆర్ గార్డెన్ కి వెళ్లేందుకు దారి లేకపోతే దారి కోసం తమ భూమిలోని కొంత భాగాన్ని విక్రయించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని చెప్పినప్పటికీ వినడం లేదని అన్నారు. తన భూమిని కబ్జాకు ప్రయత్నించడంతో పాటు పంటపొలాన్ని నాశనం చేసినందున శనివారం హుజురాబాద్ పోలీస్ స్టేషన్ లో బిఎస్ఆర్ గార్డెన్ వారిపై కూడా ఫిర్యాదు చేశానని అన్నారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయి చొరవ చూపి తనకు న్యాయం జరిగేలా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మాదకద్రవ్యాల దుర్వినియోగం -పరిణామాలపై వ్యాసరచన-ఉపన్యాస పోటీలు

భీమదేవరపల్లి వాయిస్ టుడే ఆగస్టు 10 : హనుమకొండ జిల్లా భీమదేవర పల్లి మండలం వంగర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో (The consequences of drug addiction) డ్రగ్స్ దుర్వినియోగం, వాటి వల్ల కలిగే దుష్ప పరిణామాలపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు సంతాబాద్, ఈశ్వర్, రిషిత్, శాన్వి, సన్నీ, జస్వంత్ లకు బహుమతులు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి మాట్లాడుతూ పాఠశాలలో సామాజిక అంశాల పట్ల అవగాహన కోసం విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు తాత్కాలిక సంతోషాల కోసం మాదాక దవ్యాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దనితెలిపారు.తల్లిదండ్రులు పిల్లలు ఏం చేస్తున్నారో నిత్యం గమనిస్తూ ఉండాలని కోరారు.



### ఆర్టీఐ మాజీ జాతీయ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్

### దేశ స్వాతంత్ర ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన జాతీయ యోధుల అమరవీరుల చిత్రపటాల ఎగ్జిబిషన్ ..మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభం



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- రాజ్యాంగంలో సెక్యులరిజం అనే పదాన్ని తీసి ఇస్తే పోయేది కాదు ప్రజల గుండెల్లో ఉన్నదని ఆర్.టి.ఐ మాజీ జాతీయ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. శనివారం ఆవాదు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో ఉన్న శ్రీ సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్లో 10,11 తేదీల్లో జరుగుతున్న రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ముందుగా రాష్ట అధ్యక్షులు మహమ్మద్ అన్సారి ఆవిష్కరణ చేశారు.అనంతరం దేశ స్వాతంత్ర ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన జాతీయ యోధుల అమరవీరుల చిత్రపటాల ఎగ్జిబిషన్ ను పట్టణ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభం చేశారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు మీరా చౌదరి అధ్యక్షతన సెమినార్ జరిగింది.ఈ సెమినార్ కు ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్టిఏ మాజీ జాతీయ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని ప్రభుత్వం యంత్రాంగాన్ని సైతం మైనార్టీలపై దాడులకు ఉపయోగించుకుంటున్న దురదృష్ట సంఘటనలు అనేకం జరుగుతున్నాయని,ఈ మతోన్మాద సాంస్కృతిక క్రమంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా విస్తరిస్తున్నది మతోన్మాద శక్తులు విష ప్రచారం తెలంగాణ ప్రజల మనస్సును కలుషితం చేస్తున్నదన్నారు. రాజ్యాంగ బద్ధ హక్కుల పరిరక్షణ కై పోరాటాలు చేయాలన్నారు. డాక్టర్ మహమ్మద్ రియాజ్ తెలంగాణ రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగినాయన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఎం ఏ రహీం హవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జహంగీర్ అవాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యం.ఎ ఇక్బాల్ మీర్ ఖాజా హాలీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్కే లతీఫ్ నాయకులు ఎస్.కె ఇమామ్ పాషా మీర్ యూసుఫ్ అలీ ముక్తార్ హుసేన్ షేక్ అమీద్ పాషా ఎండి పాషా ఎస్.కె ఉమర్ అబ్దుల్ రెహ్మాన్ మహ్మద్ సాజీద్ తదితరులు పాల్గొన్నారు.



## దేశ స్వాతంత్రం కోసం నిస్వార్ధంగా తమ జీవితాలను త్యాగం చేసిన గొప్ప వ్యక్తులు " ఫ్రీడమ్ ఫైటర్స్"

### స్వాతంత్ర ఉద్యమానికి మూల స్తంభాలుగా నిలిచిన ఫ్రీడమ్ ఫైటర్స్నీ గౌరవించుకోవాలి..స్మరించుకోవాలి

### హర్ ఘర్ తిరంగా అబియాన్ ప్రోగ్రామ్ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు

జమ్మికుంట ఆగస్టు 10 (వాయిస్ టుడే): దేశ స్వాతంత్రం కోసం నిస్వార్ధంగా తమ జీవితాలను త్యాగం చేసిన గొప్ప వ్యక్తులు ఫ్రీడమ్ ఫైటర్స్ అని, స్వాతంత్ర ఉద్యమానికి మూల స్తంభాలుగా నిలిచిన ఫ్రీడమ్ ఫైటర్స్ ను గౌరవించుకొని, స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో శనివారం రోజున జమ్మికుంట పట్టణంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన దీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను శుద్ధి చేసి, దేశం కోసం వారూ చేసిన సేవ, త్యాగాలను స్మరించుకొని, గుర్తు చేసుకోవడం జరిగిందన్నారు. దేశ స్వాతంత్రం కోసం స్వాతంత్ర సమరయోధులు పడిన బాధలు, కష్టాలు, ఎదురుదెబ్బలు మాటల్లో చెప్పలేమన్నారు. ఆగస్టు 15, 1947 స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఎందరో త్యాగదనుల కృషి ఫలితమేనన్నారు. బ్రిటిష్ పాలన నుండి భారతదేశాన్ని విడిపించడానికి దేశంలోని స్వాతంత్ర సమరయోధులు ఎంతో శ్రమించి, పోరాడారని , చివరికి తమ ప్రాణాలను కూడాఅర్పించారన్నారు. ముఖ్యంగా స్వాతంత్ర సమరయోధులు దేశ ప్రజల స్వేచ్ఛను కాపాడడానికి ఏలాంటి శిక్షణ లేనప్పటికీ యుద్ధానికి కూడా వెల్లి దేశ భవిష్యత్తు తరాల కోసం ఆలోచన చేశారని, వారి త్యాగాల పునాదుల మీదనే భారతదేశానికి స్వాతంత్రం లభించిందన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఫ్రీడమ్ ఫైటర్స్ ను భావితరాలు ప్రతి ఒక్కరూ గౌరవించుకుని, స్మరించుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి సంపత్ రావు,మాడ గౌతమ్ రెడ్డి, జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, కోరే రవీందర్, పల్లపు రవి, దొంతుల రాజకుమార్, ఠాగూర్ రాజేష్, కైలాష్ కోటి గణేష్, అప్పం మధు యాదవ్, మోతే స్వామి, ఇటికలు స్వరూప, కొలకాని రాజు, తూడి రవిచంద్ర రెడ్డి, ఎదలపురం అశోక్, గండికోట సమ్మయ్య, మోడెం రాజు, ఠాగూర్ రాకేష్, బల్సుకురి రాజేష్, గిరివేని విజేందర్, మల్లాడి సమ్మిరెడ్డి ,బచ్చు శివకుమార్, రాచపల్లి ప్రశాంత్, గర్రెపల్లి నీరుపా రాణి, బూరుగుపల్లి రామ్, యంసాని శశిధర్, మర్రి రవీందర్, ఊడుగుల మహేందర్, పొనగంటి రవికుమార్, ముకుందం సుధాకర్, రాపర్తి ప్రవీణ్, అప్పల రవీందర్, కన్నెబోయిన బద్రి, కుంభాల వెంకట్రాజ్యం, నాగపురి విజయ్, యాంసాని సమ్మయ్య, గుర్రం పరశురాం, మంతిని అశోక్, తాళ్లపల్లి తిరుపతి, A. సుజన శ్రీ , రాపర్తి అఖిల్, కేశ స్వరూప, A. రామస్వామి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికలు వస్తేనే సమస్యలు గుర్తుకొస్తాయి కానీ సమస్యలు తీరవు




జమ్మికుంట ఆగస్టు 10 (వాయిస్ టుడే): హుజురాబాద్ నియోజక వర్గానికి గుండెకాయ లాంటి జమ్మికుంట పట్టణం లో వివిధ రాజకీయాల ప్రముఖులు ఎలక్షన్స్ వచ్చాయంటే ఉదయాన్నే జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్ తో కలిసి ముచ్చటించి వారి సమస్యలు తీరుస్తానంటూ అనడం వరకే, ఓట్లు దండుకోవడం మాత్రమే ఈ మైదానంలో ఒక్కరోజు వర్షం వచ్చిందంటే గ్రౌండ్ రూపు రేఖలు మారి పొలం లాగా కనిపిస్తూ ఉంటుంది, జీవితంలో వాకింగ్, వ్యాయామ తప్పనిసరి అయిన రోజుల్లో చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు రోజుకు 200 నుండి 300 వరకు వస్తుంటారు పోలీస్ రిక్రూట్మెంట్ కు వెళ్లే పిల్లలు సైతం ఇందులోనే రన్నింగ్ చేస్తూ ఉంటారు ఈ తరుణంలో బురదలో జారిపడితే కాలు గాని , చేయి ప్రమాదం జరిగినచో మొదటికే ముప్పు వస్తుంది అని వాపోతున్నారు, సాయంత్రం సమయంలో గ్రౌండ్ చుట్టూ ఉన్న లైట్స్ రాక వాకర్ ఇబ్బంది పడుతున్నారు, వ్యాయామశాలలో అన్ని చెడిపోయి ఉన్నాయి, 2004లో వాకర్స్ అందరం కలిసి 4,5 లక్షలతో ఈ మైదానం ఏర్పరచుకున్నాము అని వాకర్స్ యూనియన్ అధ్యక్షులు మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మాట్లాడారు.

## గట్లనర్సింగాపూర్ మృతుడి కుటుంబానికి సంతాపం

### నిరుపేదల నేస్తం. మా పెద్ది వెంకటనారాయణ



భీమదేవరపల్లి వాయిస్ టుడే ఆగష్టు 10: ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందిస్తూ దాతృత్వం చాటుకుంటున్న.జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ తన సేవలతో ప్రజల మన్ననలు పొందుతున్నారు. శనివారం ఆయన సహకారంతో నడుస్తున్న పెద్ది వసంత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఇటీవల బొల్లంపల్లి పెద్ద రాములు మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పెద్ది వసంత గారి చారిటబుల్ ద్వారా వారి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని వారి కుటుంబానికి అందజేయడం జరిగింది. పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న పెద్ది వసంత ట్రస్ట్ సేవలు అభినందనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొల్లంపల్లి ప్రకాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లంపల్లి సంజీవ్, బొల్లంపల్లి ప్రకాష్, జక్కుల మచగిరి,బరిగే సాయిలు, చిలుక ప్రమోద్, చంద్రశేఖర్, బోల్లంపల్లి రంజిత్, సట్ల రాంబాబు, అంబాల రాజ్ కుమార్, బొల్లంపల్లి సుశాంత్, బొల్లంపల్లి కమలాకర్, బరిగే సంపత్, కత్తుల రవి, చిట్యాల ఎల్లయ్య, త్తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ సేవలు చిరస్మరణీయం

### మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పొనగంటి మల్లయ్య




జమ్మికుంట ఆగస్టు 10 ( వాయిస్ టుడే): మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శివశంకర్ 95 వ జయంతి వేడుకలు జమ్మికుంటలో ఘనగా జరిగింది. కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ సేవలు చిరస్మరణీయమని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జమ్మికుంట మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య అన్నారు. శనివారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం చౌరస్తాలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోవెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్స్ కోసం నిరంతరం పోరాడి సాధించిన మహానేత, బడుగు బలహీన వర్గాలకు ఆదర్శప్రాయులు మున్నూరు కాపు ముద్దుబిడ్డ కేంద్ర మాజీ మంత్రి ,మాజీ గవర్నర్ జస్టిస్ పుంజాల శివశంకర్ 95వ జయంతి వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జమ్మికుంట మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య ,సింగిల్ విండో అధ్యక్షులు పొనగంటి సంపత్, బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఏ బూసి శ్రీనివాస్ లు మాట్లాడారు.న్యాయవాదిగా, న్యాయమూర్తిగా, కేంద్ర మంత్రిగా పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం, సముద్ధరణకు, దేశానికి స్వర్గీయ శివశంకర్ చేసిన సేవలు ఉమ్మడి రాష్ట్రంలో బీసీలకు, జాతీయ స్థాయిలో ఓబీసీలకు విద్యా,ఉద్యోగ రంగాలలో, స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్స్ సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సమాజంలో అట్టడుగు నుండి వచ్చిన వ్యక్తి శివశంకర్ బీసీల లో 96 కులాలను చేర్చడానికి కృషి చేశారని వారు కొనియాడారు. హైదరాబాదులోని కాచిగూడ మున్నూరు కాపు విద్యార్థుల వసతి గృహం ఏర్పాటు చేయడానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తి జన్మదిన వేడుకలను మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు . ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు పొనగంటి రాము, పొనగంటి సారంగం, మున్నూరు కాపు సంక్షేమ సంఘం మండల నాయకులు పొనగంటి సంపత్ వి ఏ పి, ఆకుల నారాయణ, ఏ బూసి సంపత్ ,పొనగంటి మల్లయ్య , ఎడ్ల రాజేందర్, ముకుంద సుధాకర్, అప్పాల రవీందర్, పొన్నగంటి సతీష్,ఏభూషి సంపత్, శేశాల మొగిలి, పొన్నగంటి సందీప్ , పొన్నగంటి ప్రభాకర్, కాసర్ల సతీష్, పొన్నగంటి రవీందర్ , పొనగంటి అనిల్,గిర్నాల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగుల వంశీ గౌడ్ ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మత్తులు

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి ఆగస్టు 10: బోయినపల్లి మండల కేంద్రం నుండి కోదురుపాక వెళ్లే దారిలో దేశాయిపల్లి గ్రామం వరద కాలువ వద్ద ఇటీవల కురుసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్డును చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు కూస రవీందర్ సహకారంతో యువజన కాంగ్రెస్ బోయినపల్లి మండల అధ్యక్షుడు నాగుల వంశీ గౌడ్ రోడ్డు మరమ్మతులు చేపించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం త్వరలోనే బిటి రోడ్డు లేదా సీసీ రోడ్డు వేపించి సమస్య శాశ్వత పరిష్కారం చేపిస్తా అని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బోయినపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు బోయిని ఎల్లేష్,యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు నిమ్మ వినోద్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఏనుగుల ప్రశాంత్ కుమార్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొప్పుల నగేష్, మండల అధికార ప్రతినిధి ఎండీ హుస్సేన్, మండల కార్యదర్శి కళ్లపెల్లి సతీష్ మరియు తదితరులు పాల్గొన్నారు



## విద్యార్థినినీ సన్మానించిన యూత్ కాంగ్రెస్ సజ్జు

జమ్మికుంట ఆగస్టు 10 (వాయిస్ టుడే): ఇండో అమెరికన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరియు అమెజాన్ ఫుచర్ ఇంజనీర్ వారి నీతృత్వంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 ప్రభుత్వ పాఠశాల నుండి 80 విద్యార్థులను సెలెక్ట్ చేసి వారి నైపుణ్యాంలో జిల్లాస్థాయి కాంపిటేషన్ నిర్వహించగా డిజిటల్ క్లాసులు, కంప్యూటర్ స్కిల్స్, కోడింగ్, మ్యాస్, ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర డిపార్ట్మెంట్లకు సంబంధించి విభాగాలలో జమ్మికుంట ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థిని సనా ఖాన్ ఇందులో మొదటి బహుమతి పొందినందుకుగాను యూత్ కాంగ్రెస్ హుజరాబాద్ నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షులు సజ్జాద్ మొహమ్మద్, జోరుక సాయి లు కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది.



## మున్నూరుకాపు ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పుంజాల శివశంకర్ జయంతి వేడుకలు

కరీంనగర్ ఆగస్టు 10(వాయిస్ టుడే)తెలంగాణ మున్నూరు కాపు ఉద్యోగుల మరియు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో మున్నూరుకాపు ముద్దుబిడ్డ, మాజి కేంద్ర మంత్రి పుంజాల శివశంకర్, జయంతి వేడుకలు నిర్వహించారు. సందర్భంగా పుంజాల శివశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కామ సతీష్ పటేల్, రాష్ట్ర కోశాధికారి మామిడి రమేష్ పటేల్, రాష్ట్ర నాయకులు నుగిళ్ళ కిషన్ పటేల్, పసుల రవికుమార్ పటేల్, జిల్లా నాయకులు పుల్లెల సుధీర్ పటేల్ శ్రీగిరి శ్రీనివాస్ పటేల్, వంగ సుధాకర్ పటేల్, గాజ నాగులు పటేల్, పెరుక నర్సయ్య పటేల్, దాసరి రాజన్ బాబు పటేల్, మహేందర్ పటేల్, పత్తెం శ్రీనివాస్ పటేల్, పత్తెం మధుబాబు పటేల్, సురేష్ కుమార్ పటేల్, మొండయ్య పటేల్, పోచయ్య పటేల్, రజిత పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## పేదవారికి ఉచిత కంటి ఆపరేషన్లు

కరీంనగర్ ఆగస్టు 10(వాయిస్ టుడే) లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ లయన్ చింతల కిషన్ పటేల్ ఎంజెఎఫ్ జోన్ చైర్ పర్సన్, రీజియన్ 8 జోన్ 2 లయన్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 320 జి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి లో కరీంనగర్ లోని వివిధ గ్రామాలకు చెందిన వారికి పేదవారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్ , ట్రస్ట్ మెంబర్ కోల అన్నారెడ్డి సహకారంతో నేటి రోజు వరకు 129 ఉచిత కంటి శాస్త్ర చికిత్సలు నిర్వహించడం జరిగింది. అనంతరం పండ్లు, బ్రెడ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్, కన్నాపూర్ గ్రామం తాజా మాజీ సర్పంచ్ లయన్ వెంకటరమణారెడ్డి, పోతారం గ్రామం తాజా మాజీ ఎంపీటీసీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




## నా భర్తను నాకు అప్పగించండి సీపీ సార్

**వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్న భర్త**

**పెళ్లయిన 6 నెలలకే ఎడబాటు.. అదనపు కట్నం కోసం ఫోన్లో బెదిరింపులు**

**పోలీసులు కౌన్సిలింగ్ పేరుతో కాలయాపన**

ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, ఆగస్టు 10 వాయిస్ టుడే : పెద్దల సమక్షంలో అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకుని 6 నెలలకి పరారీలో ఉంటూ అదనపు కట్నం కోసం ఫోన్లో వేధిస్తున్న నా భర్తను నాకు అప్పగించమని ఓ మహిళ తన ఆవేదనను విలేకరుల ముందు వెల్లబుచ్చింది. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు మాట్లాడుతూ... మాది కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన పూదరి నాగేశ్వరరావు కూతురును. అమ్మమ్మ మేన మామ ఊరైన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామంలో స్థానిక నివాసానికి చెందిన వారము నన్ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలం, జడలచింత గ్రామానికి చెందిన కళ్లెం నరసింహారావు కుమారుడు కళ్లెం సునీల్ తో డిసెంబర్ 8, 2023న కుల పెద్దల సమక్షంలో పెళ్లి చేశారు. పెళ్లయిన నెల రోజుల నుండి అదనపు కట్నం కోసం వేధింపులు మొదలుపెట్టి ఇతర మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని 6 నెలలకే బయటకు వెళ్లిపోయి నీ అంతు చూస్తా నీ సంగతి చూస్తా అంటూ దుర్భాషలాడుతూ నా కుటుంబ సభ్యులతో సహా అందరినీ ఫోన్లో బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించింది. పూర్తి సాక్ష్యాధారాలతో కాల్ రికార్డు తో సహా పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా కౌన్సిలింగ్ పేరుతో తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లా అధికారులు స్పందించి నా భర్తను నాకు అప్పగించి తనకు తగిన న్యాయం చేయాలని వేడుకుంది. ఈ విలేకరుల సమావేశంలో తల్లి పూదరి రమ, మేనమామ గాలి రాము, మేనత్త గాలి రేవతి, పెదనాన్న కోసూరి వీరబాబు, అన్నయ్య మరీదు గోపి ఉన్నారు.

## బాధిత కుటుంబానికి లయన్స్ క్లబ్ సహాయం




వాయిస్ టుడే ఆగస్టు 10 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి) సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన కనకరాజు క్యాన్సర్ తో మృతి చెందగా ఆ కుటుంభ సభ్యులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు " దీపాంజలి మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న ఎంతో కొంత సహాయాన్ని అందించడంలో లయన్స్ ముందుంటారని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలనుండి క్లబ్ ఎంతో మందికి చేయూత నిచ్చిందని సూచించారు. సహాయం ఇచ్చిన లయన్స్, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు తొలగిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి ఆగస్టు 10 : బోయినపల్లి మండలం బోయనాపల్లి మండలం బూరుగుపల్లి లోని గ్రానైట్ క్వారీకి విద్యుత్ సరఫరా ఇవ్వడం కోసం కోరెం లో రహదారి పక్కన హరితహారంలో నాటిన చెట్లను తొలగించి విద్యుత్ స్తంభాలు వేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు భారతీయ జనతా పార్టీ నాయకులు క్యాతం తిరుపతిరెడ్డి తెలిపారు. గ్రామపంచాయతీకి ఎలాంటి సమాచారం లేకుండా సెస్ అధికారులు చెట్లను తొలగిస్తున్నారని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు .సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



## ఢిల్లీ సుప్రీంకోర్టు అడ్వకేట్ ను సన్మానించిన ఎమ్మార్పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్

వరంగల్ (వాయిస్ టుడే) ఆగస్టు 10: సుప్రీమ్ కోర్టు అడ్వకేట్ సిద్ధార్థ లూత్ర ని కలిసిన ఎమ్మార్పిస్ నాయకులు ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ మాట్లాడుతూ.. SC వర్గీకరణపై సుప్రీమ్ కోర్ట్ లో వాదించడానికి తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూద్రని శనివారం ఢిల్లీలోని తన కార్యాలయంలో కలిసి ఎస్సి వర్గీకరణకు అనుకూలంగా వాదనలు వినిపించిన సుప్రీమ్ కోర్ట్ ఏడుగురు సభ్యుల ధర్మాసనంలో చీఫ్ జస్టిస్ డి వై చంద్రచూడ్గారితో సహా ఆరుగురు సభ్యులు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువరించేలా కేసు వాదించిన సద్దార్థ్ లూద్రాని శాలువాతో సన్మానించి బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపినము అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దళిత రత్న కేదాసి మోహన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేద్దాం..

వరంగల్ (వాయిస్ టుడే) ఆగస్టు10: దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో తూర్పు నియోజకవర్గ భాజపా ముఖ్య నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆగస్టు13వ తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రతి ఒక్కరు తమ ఇంటిపై విధిగా జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ సమైక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కర్నె రవిందర్, 42వ డివిజన్ అధ్యక్షులు తాళ్లపెల్లి అర్జుణ్ గౌడ్, 39వ డివిజన్ అధ్యక్షులు బోరిగం నాగరాజు, 41వ డివిజన్ అధ్యక్షులు కర్నె వాసుదేవ్, 40వ డివిజన్ అధ్యక్షులు ఆకుతోట రాజు, నాయకులు బక్కి రంజిత్, ఆరె కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మహత్య చేసుకొన్న జర్నలిస్ట్ యోగి కుటుంబన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి



వరంగల్ ( వాయిస్ టుడే ) ఆగష్టు 10 : ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్ట్ యోగి రెడ్డి కుటుంబాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదుకోవాలనీ పాలకుర్తి విజయ్ కుమార్ డిమాండ్ చేశారు శనివారం నాడు నర్సంపేట పట్టణంలోని తన కార్యాలయంలో ఒక ప్రకటన ద్వారా అయన మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో కడు పేదరికంలో మగ్గుతు ఆర్థికంగా కుటుంబాన్ని పోషించలేక అప్పులు చేసి ఆత్మహత్యలు చేసుకుంటున్న జర్నలిస్టుల సంఘటన లపై తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి జర్నలిస్టులను ఆదుకోవాలని అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటర్ కమిటీ మెంబర్ పాలకుర్తి విజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం నాడు వరంగల్ జిల్లాలోని యువ జర్నలిస్టు యోగి రెడ్డి తన కూతురితో సహా ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమైన విషయమని జరిగిన సంఘటన పై వరంగల్ జిల్లా కలెక్టర్ స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పాలకుర్తి విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. వరంగల్ జిల్లాలో జర్నలిస్టులకు జర్నలిస్టు సంఘాలు యూనియన్లు నాయకులు మనోధార్యాన్ని ఇవ్వాలని మానసిక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న జర్నలిస్టులను ఆదుకోవాలని వారి కుటుంబాలను కాపాడాలని పాలకుర్తి విజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేస్తూ జర్నలిస్టు సంఘాలను కోరారు. ఇక ముందు జర్నలిస్టులు ఎవ్వరు ఆత్మహత్యలకు పాల్పడకుండా వారికీ మనో ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు.

## గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

వరంగల్ ( వాయిస్ టుడే) ఆగస్టు10 కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి సరఫరా మార్గాన్ని ఎంచుకున్న వ్యక్తిని శనివారం ఇంతేహాజర్ గంజ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలలోకెళితే హనుమకొండకు చెందిన గాదె శ్రీనివాస్ తన ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగాలేక ఎలాగైనా సులభంగా డబ్బులు సంపాదించాలని అనుకున్నాడు. గంజాయి అమ్మి డబ్బులు సంపాదించాలని నిశ్చయించుకొని ఒరిస్సా రాష్ట్రం సీలేరు దగ్గర తక్కువ ధరకు గంజాయి తీసుకువచ్చి దానిని వరంగల్ బస్టాండ్ దగ్గర అమ్మడానికి తీసుకురాగా అక్కడ గస్తీ లో పోలీసులను చూసి పారిపోతుండగా ఎస్ ఐ వెంకన్న పట్టుకొని అతని వద్ద ఉన్న 33,250 రూపాయల విలువ గల 1350 గ్రాముల గంజాయిని స్వాధీన పరుచుకొని నిందితుడిని రిమాండ్ కు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ మత్స్య శివకుమార్ మాట్లాడుతూ ఎవరైనా గంజాయి రవాణా చేసిన, అమ్మిన మరియు గంజాయి సేవించిన చట్టరీత్యా చర్య తీసుకుంటామని హెచ్చరించారు.



# రైల్వే పెన్షన్ దారులకు ఘన సన్మానం

### పెన్షనర్ అసోసియేషన్ సెక్రెటరీ రావిపాటి సత్యనారాయణ



భద్రాద్రి కొత్తగూడెం/వాయిస్ టుడే: కొత్తగూడెం లోని బిడిసిఆర్ రైల్వే సెక్టార్ లో 35 సంవత్సరాలు రైల్వేలో విధులను నిర్వహించి వారి శక్తి సామర్థ్యాలను ప్రభుత్వ ప్రయోజనాలకు వినియోగించి మంచి ఆరోగ్యంతో ఉండి నేటికీ పెన్షన్ తీసుకుంటున్న 75 సంవత్సరాలు పైబడిన వారికి శుక్రవారం నాడు కొత్తగూడెంలోని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో సన్మానం ఏర్పాటు చేశారు. 1995 సంవత్సరంలో ఏర్పాటైన ఈ సంఘం ద్వారా సంఘంలోని సభ్యులకు ప్రభుత్వం ద్వారా రావలసిన రాయితీలను అందించడంలో సంఘ పెద్దలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటివరకు ఈ సంఘంలో 400 పైచిలుకు సభ్యులు కలరు. ఈ కార్యక్రమంలో భాగంగా రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు సీనియర్ పెన్షన్ దారులు రావిపాటి సత్యనారాయణకు శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం 75 సంవత్సరాలు పైబడిన పెన్షన్ దారులు పి విమల, సారయ్య, లక్ష్మమ్మ, కాసింబి, కాజా, మొహినిద్దీన్, ఎండి అఫ్జల్, కొమరమ్మ, ఆగస్టీన్, జానీమియా, ఏవి రాగం అమ్మ, నరసయ్య, శాంతమ్మ, వీరభద్రయ్య, వైకుంఠ రావు, వాల్తి, పాండురంగం, జయరాలకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు రైల్వే యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించింది

**వ్యవసాయ కార్మికులకు కాంగ్రెస్ ఇస్తామన్న ఏడాదికి 12,000 వెంటనే ఇవ్వాలి.**

**పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికుల కూలిరేట్లను సవరించాలి.**

**వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్**



సూర్యాపేట/హుజూర్ నగర్ : ఆగస్టు 10(వాయిస్ టుడే ప్రతినిధి) కంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్ లో వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు ఆరోపించారు. శనివారం హుజూర్ నగర్ పట్టణంలోని అమరవీల స్మారక భవన్ లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హుజూర్ నగర్ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల 2024-2025 బడ్జెట్- ఉపాధి- సంక్షేమం- కనీస వేతనాలు అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇటీవల పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఉపాధి హామీకి కేవలం 86 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించడం తగదన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకానికి కేవలం 36 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని విమర్శించారు. ఈ బడ్జెట్ లో కార్పొరేట్ శక్తులను , విదేశీ పెట్టుబడి దారుల సంతృప్తి పరచడం తప్పదేశంలో ఉన్న ప్రజల కష్టాలను తీర్చే బడ్జెట్ కాదన్నారు.ఆహార ఉత్పత్తి ధరలు3.8 నుండి7.5శాతం కు పెరిగాయన్నారు. గత బడ్జెట్ లో ఆహార భద్రతకు 2,12 వేల కోట్ల రూపాయలు కేటాయించిన ప్రభుత్వం ఈ బడ్జెట్ లో 2000 వేల కోట్ల రూపాయలు తగ్గించిందన్నారు. ఈ కేటాయింపులు చూస్తేఆహార భద్రతను పూర్తిగా విస్మరించినట్టుగా ఉందన్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో ప్రకారంరైతుల ఆత్మహత్యల కంటే గ్రామీణ పేదల ఆత్మహత్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంతంలో70% గా ఉన్న ఉపాధి కూలీలకు గత బడ్జెట్లో 86 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, ఈ సంవత్సరం కూడా86 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. ఉపాధి హామీకిరెండు లక్షల కోట్లరూపాయలు కేటాయించాల్సి ఉందన్నారు. ఉపాధి కూలీల వేతనాల పెంపు, వ్యవసాయ కార్మికుల కూలీల పెంపు వంటిప్రతిపాదనలు బడ్జెట్ లో లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. వృద్ధులు వితంతువులు, వికలాంగులకు 96 00కోట్ల రూపాయలు గత సంవత్సరం కేటాయించిన ప్రభుత్వం స్వల్పంగా 9652 కోట్లరూపాయలు కేటాయించిందన్నారు. విద్య,వైద్యానికి నిధుల కేటాయింపుల విషయంలోనిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కిందగత సంవత్సరం 54 వేలకోట్లు కేటాయించారని, ఖర్చు మాత్రం 32 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

శాసనసభలో రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2024-2025 బడ్జెట్ లో కేటాయింపులు ఘనంగా ఉన్నాయని, కేటాయించిన బడ్జెట్ ను చిత్తశుద్ధితో ప్రభుత్వం ఖర్చు చేయాలని అన్నారు.2,91,159 కోట్లతో రూపొందించిన బడ్జెట్ లో ప్రజా పంపిణీ, ఇండ్ల నిర్మాణానికి, విద్య, వైద్యానికిబడ్జెట్ లో ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. బడ్జెట్ లో వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12,000 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించారని, దానిని ఎప్పటినుండి అమలు చేస్తారో స్పష్టంగా పేర్కొనలేదన్నారు. కోట్లాదిమందికి ఉపాధికలిగించే ఉపాధి హామీ కి బడ్జెట్ లో నిధులు పెంచలేదన్నారు. బడ్జెట్ లో వృద్ధులు, వితంతువులు, వికలాంగుల, ఇతర సామాజిక పింఛన్ పెంపు ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరమన్నారు. బడ్జెట్ లో మహాలక్ష్మి పథకానికి కేటాయింపులు లేకపోవడం మహిళలని మోసం చేయడమేనని ఆరోపించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోసన పోయిన హుస్సేన్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బి కే ఎం యు ) జిల్లా ప్రధాన కార్యదర్శిధూళిపాళ్ల ధనుంజయ నాయుడు,తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుపల్లె వెంకట్ రెడ్డి,సిఐటియుజిల్లా ఉపాధ్యక్షులు శీలం శీను,సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వట్టే పు సైదులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(బి కే యం యు) జిల్లా నాయకులుజడ వెంకటేశ్వర్లు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, జిఎంపిఎస్ జిల్లా నాయకులుపాశం వెంకట్ నారాయణ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులుగుండు సైదయ్య, హమాలి సంఘం నాయకులు కాలింగి నరసింహారావు, రైస్ మిల్ డ్రైవర్ల సంఘంనాయకులు సిహెచ్ మల్లయ్య,రిక్షా యూనియన్ నాయకులుఎం రమేష్,వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకురాలు శశికళ తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రి ఆలయాన్ని సందర్శించిన సీఎం సోదరుడు

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి సోదరుడు శనివారం ప్రసిద్ధ పుణ్య క్షేత్రం యాదాద్రిని సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన శ్రీ లక్ష్మి నరసింహ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అర్చకులు ఆశీర్వచనం జరిపి స్వామివారి ప్రసాదం అభిషేకం లడ్డు, శేషవస్త్రం అందజేశారు.

## సింగరేణి క్వార్టర్స్‌లో గవర్నమెంట్ పోల్స్ వేసి కరెంటు ఇవ్వాలని డిఈకి వినతి



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి ఆగస్టు 10 2024 (వాయిస్ టుడే) : బెల్లంపల్లి పట్టణం 21వ వార్డు ఇంచార్జ్ ఎలుక ఆకాష్ బూడిద గడ్డ బస్తి లోని సింగరేణి క్వార్టర్ ఏరియాలో గవర్నమెంట్ పోల్స్ వేసి కరెంటు ఇప్పించగలరని బెల్లంపల్లి డిఈ కి వినతి పత్రం ఇవ్వగా దానికి డిఈ సానుకూలంగా స్పందించి ఏఈ శ్రీనివాస్, లైన్మెన్ ని పంపించి సర్వే చేసి సంబంధిత అధికారులతో మాట్లాడి గర్నమెంట్ కరెంటు వచ్చే విధంగా చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠకుల సురేష్ బస్తివాసులు పాల్గొనడం జరిగింది.

## క్రీడలు మానసిక ఉల్లాసానిస్తాయి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్**



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఆగస్టు 10) కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో భాగంగాకొత్తగూడెం పట్టణ పరిధిలోని రామవరం సాధన గ్రౌండ్లో క్రీడా పోటీలను నిర్వహించారు ఈ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ పాల్గొని ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ రోజువారి వృత్తిలో భాగంగా మానసికంగా వృత్తిపడంగా ఒత్తిడికి గురవుతారు అలాంటి సమయంలో ఈ క్రీడలు పోటీలు మానసిక ఉల్లాసముతో పాటు మానసికంగా దృఢత్వాన్ని ఇస్తాయని అన్నారు అనంతరం న్యాయమూర్తులు న్యాయవాదులు మూడు జట్లుగా విభజించి పోటీలను నిర్వహించగా ఆ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తిలకించారు ఉదయం నుంచి సాయంకాలం వరకు క్రికెట్ పోటీలు కొనసాగగా న్యాయమూర్తులు న్యాయవాదులు ఉల్లాసంగా క్రీడా స్ఫూర్తితో క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గొల్లపూడి భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, రెండవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె. సాయిశ్రీ, మూడవ అదనపు జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివ నాయక్, కొత్తగూడెం భార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు తోట మల్లేశ్వరరావు, ఎమ్మెస్సార్ రవిచంద్ర , సాదిక్ పాషా, దూదిపాల రవికుమార్, ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రతిభ సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఎంపీపీ, ఎంపీటీసీ, పాలకవర్గానికి ఘన సన్మానం



ముదిగొండ మండలం ఆగస్ట్ 10 వాయిస్ టుడే : ముదిగొండ మండల పరిధిలోని చిరుమర్రి గ్రామంలో ఎంపీటీసీ కోలేటి అరుణ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ వైస్ఎంపీపీ మంకెన దామోదర్ కిమరియు మాజీ పంచాయతీ పాలక వర్గానికి చిరుమర్రి గ్రామ ప్రజలు ఘనంగా సన్మాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం కు సామినేని రామారావు అధ్యక్షతన జరిగింది ముఖ్య అధితిగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు బండి రమేష్ హాజరు అయ్యి వారు మాట్లాడుతూ నేడు గ్రామం లో అన్ని పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం మంచి సంప్రదాయం అని ఇలాగే ప్రజా సమస్యల పరిష్కరించడంలో కూడా అందరూ కలిసి ముందుకు వెళ్లాలని ఎంపీటీసీ లు నిధులు తక్కువగా ఉన్న అభివృద్ధితో పాటు నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేయడం వలన ప్రజలు మర్చిపోరని ఆ పద్ధతిలో ఉండటం వలనే ఈ రోజు పెద్ద ఎత్తున ప్రజలు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారని పదవి ఉన్నా లేకపోయినా ప్రజలతో నిత్యం కలిసి ఉండాలని కోరారు.విద్యార్థి దశ నుండి నేను నిత్యం ప్రజా సమస్యల పై పోరాడుతున్నాను మొదటి సారి ప్రజలకు దూరంగా అమెరికా వెళ్లిన అక్కడ ప్రజల స్థితి గతుల పై అధ్యయనం చేసిన అక్కడ పెట్టుబడి దారి ప్రభుత్వం ఉన్న అన్ని ప్రభుత్వ నిర్ణయాలు అందరు అమలు చేయడం వలన అక్కడ వాతావరణం బాగుంది అలాగే ఇక్కడ కుల మత బేధాలు లేకపోవడం కూడా బాగుంది అయినా అక్కడ ప్రజలు అందరు సుఖంగా లేరని సమస్యలపై పోరాటాలు కూడా నడుస్తున్నాయని నేను కూడా ఒక ఆందోళన లో పాల్గొన్నానని ఎర్ర జెండా పుట్టిన చోటు కి పోయినప్పుడు నేను కమ్యూనిస్టా గర్వపడ్డానని మనిషికి మార్క్ సిద్ధాంతంమే సరిఅయిన మార్గం అని అన్నారు ఎంపీపీ మాట్లాడుతూ నన్ను ఎంపీపీ గా ఎన్నుకున్న, సిపిఎం పార్టీ ఆశించినట్టు నేను నిత్యం ప్రజా సమస్యల పై ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాడినని అదే బాటలో పని చేస్తానని అన్నారు. మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం మాట్లాడుతూ అరుణ దామోదర పార్టీ లైన్ లో పని చేస్తూ పార్టీ ప్రతిష్ట పెంచారని కొనియాడారు

అరుణ మాట్లాడుతూ నన్ను భారీ మెజారిటీ తో గెలిపించిన వెంకటాపురం చిరుమర్రి నాయకులకు ప్రజల కు ధన్యవాదములు చెపుతూ పదవి ఉన్న లేకపోయినా ప్రజల తో ఉంటానని అన్నారు ఈ కార్యక్రమంకు నాయకులు కందుల భాస్కర్ రావు, రాయల శ్రీనివాస్ రావు, బండి శేఖర్, సామినేని రాంబాబు, ఇనప బాబు, ఉన్నాం కోటేశ్వరరావు, తెరాస నాయకులు సామినేని నాగేశ్వరావు, సతీష్ కాంగ్రెస్ నాయకులు బెజవాడ వంశీ కృష్ణ, కందుల బాలచందర్, కందుల రంగారావు, గ్రామ పంచాయితీ శాఖ కార్యదర్శులు ఉస్సేన్ కత్రం, గురవయ్య, మోర రామకృష్ణ, ఇనప ఉపేందర్, వార్డు మెంబెర్స్ గాలి శ్రీనివాస్ రావు, ఇనుకొండ రాణి రమేష్, గండు పుల్లమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థలకు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి!

**కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి: వెంకటరెడ్డి**



కోదాడ,నడిగూడెం :ఆగస్టు 10(వాయిస్ టుడే పతినిది) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందించి పార్టీ అభివృద్ధికి సహకరించాలని సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూత్కూరు వెంకటరెడ్డి కోరారు. మిగులు రాష్టంగా ఉన్న తెలంగాణరాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకొని పోవడానికి కారణం బిఆర్ఎస్ పార్టీ విధానాలేనని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి, విజయాలు సాధించాలని కార్యకర్తలను వెంకటరెడ్డి కోరారు. రాష్ట్ర మంత్రి, స్థానిక శాసన సభ్యురాలు ఉత్తంకుమార్ రెడ్డి ,పద్మావతి రెడ్డి సహాయ సహకారాలతో పార్టీని అభివృద్ధి చేయాలని వెంకటరెడ్డి కోరారు.

## మున్సిపల్ వర్కర్, ఓదెమ్మ మరణానికి మున్సిపల్ అధికారులు డాక్టర్ల నిర్లక్ష్యమే కారణం

**ఓదెమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో సిపిఎం ఆందోళన**

**సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు**



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఆగస్టు 10) మున్సిపల్ శానిటేషన్ వర్కర్ బత్తుల ఓదెమ్మ మరణానికి మునిసిపల్ కమిషనర్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు ఆరోపించారు. ఓదేమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సిపిఎం ఆందోళన చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వెంటిలేటర్ లేకపోయినా ఇక్కడే వైద్యం అందించారని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి లేదా భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించిన వెంటిలేషన్ సాయంతో ఓదెమ్మ బ్రతికి ఉండేదని ఆయన అన్నారు. హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఓదెమ్మ దగ్గరకు వచ్చిన మున్సిపల్ కమిషనర్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉంచాలని బయటకి ఎక్కడికి పంపించాల్సిన అవసరం లేదని డాక్టర్లతో చెప్పారని అలాగే డాక్టర్లు కూడా మందు తీసుకున్న వ్యక్తిని కనీసం 24 గంటలు కూడా ఐసీయూలో ఉంచకుండా జనరల్ వార్డుకు పంపించి ట్రీట్మెంట్ అందించారని ఆక్సిజన్ సరిగా అందక పోవడం వల్లనే ఆమె చనిపోయినదని ఆరోపించారు.దోమల మందుని మంచినీళ్ళ బాటిల్లో ఉంచి కనీసం దానిపై ఎలాంటి హెచ్చరిక స్టిక్కర్ లేకపోవడం ప్రత్యేకంగా దానికి ఒక బాధ్యున్ని కేటాయించక పోవడం వలన ఈ ప్రమాదం జరుగిందని అందుకు భాద్యులుగా మున్సిపల్ కమిషనర్ శానిటరీ ఇన్స్పెక్టర్ ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్ ఓదేమ్మ కు మెరుగైన వైద్యం అందించకుండా పాలకవర్గం కూడా నిర్లక్ష్యం వహించందని ఆయన ఆరోపించారు ఓదేమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డ్యూటీ లో చనిపోయినందుకు ప్రభుత్వం ఎక్స్ గ్రేసియా అందించాలని డిమాండ్ చేశారు...

**ఫలించిన సిపిఎం పోరాటం...**

సిపిఎం మద్దతుతో కుటుంబ సభ్యులు చేస్తున్న ఆందోళన వద్దకు వచ్చిన డిఎస్పి చైర్పర్సన్ కుట్టంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని,మూడు లక్షలు ఎక్స్ గ్రేసియా చెల్లిస్తామని హామీ ఇచ్చాక ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ టౌన్ కమిటీ సభ్యులు డి వీరన్న నందిపాటి రమేష్ నాయకులు కాలంగి హరికృష్ణ రామ్ చరణ్ రాములు జలాల్ తదితరులు పాల్గొన్నారు.ర



## ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ రివ్యూ మీటింగ్ వీడియో కాన్ఫరెన్స్

( భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఆగస్టు 10 ) శనివారం రోజున సింగరేణి సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ యొక్క రివ్యూ మీటింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించడం జరిగినది. టి. సూర్యనారాయణ, జి.యం (సివిల్) అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షా సమావేశానికి 12 ఏరియాల సివిల్ డిపార్ట్మెంట్ అధిపతులు, ఇతర అధికారులు మరియు సిబ్బంది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ యొక్క సమీక్షా సమావేశంలో జి.ఎం (సివిల్) అన్ని ఏరియాల సివిల్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, సింగరేణిలో అన్ని ఏరియాలలో నిర్మాణములో ఉన్నటువంటి సివిల్ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు రాబోయే కొత్త ప్రాజెక్ట్స్ కు సంబంధించిన పనుల గురించి చర్చించి అట్టి నిర్మాణములో ఉన్న పనులను రక్షణతో కూడిన నాణ్యతతో త్వరితగతిన నిర్ణీత కాల పరిమితిలో పూర్తిచేయాలని అదేవిధంగా రాబోయే కొత్త ప్రాజెక్ట్స్ కు సంబంధించిన ప్రణాళికలను త్వరగా సిద్ధం చేసి వాటి యొక్క అమలుకు కృషి చేయాలని అధికారులను సిబ్బందిని ఆదేశించినారు. అంతేకాకుండా ఈ వర్షకాలంలో వాతావరణ సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకొని అన్ని నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ శుభ్రమైన త్రాగునీటిని సింగరేణి కాలనీవాసులకు అందజేయాలని సూచించినారు ఈ యొక్క సమావేశంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజెస్, రైల్వే సైడింగ్స్ సి ఏ పి ఈ ఎక్స్ 2024-25, యాన్యువల్ ప్లాన్ 2024-25 ఇతర ముఖ్యాంశాలపై జి.యం(సివిల్) ఏరియా సివిల్ అధికారులతో చర్చించి భవిష్యత్తులో తీసుకోవలసిన చర్యల గురించి దిశా నిర్ధేశ్యం చేయడం జరిగినది. ఈ సమీక్షా సమావేశములో జి.ఎం(సివిల్) తో పాటు మిగత సివిల్ అధికారులు సివిల్ క్వాలిటీ కంట్రోల్ సెల్ కు సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
ఆదివారం, 11 ఆగస్టు 2024

# చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పిట్ సేఫ్టీ కమిటీ అండ్ మైన్స్ కమిటీ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఆగస్టు 10) ఎన్. బలరాం, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సింగరేణి అన్ని ఏరియాలో రక్షణ పై అవగాహన కల్పించుట కొరకు అన్ని మైన్స్ డిపార్ట్మెంట్ పిట్ సేఫ్టీ కమిటీ మైన్స్ కమిటీ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ యొక్క వీడియో కాన్ఫరెన్స్ సింగరేణి సంస్థలోని అన్ని ఏరియాలలో జనరల్ మేనేజర్ మరియు అధికారులు పిట్ సేఫ్టీ కమిటీ మైన్స్ కమిటీ సభ్యులు తో వారి వారి ఏరియా నందు పాల్గొనడం జరిగింది. అలాగే ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఆయా ఏరియాలోని జిఎం పాటు సంబంధిత డైరెక్టర్స్ లు పాల్గొన్నారు. శనివారం మధ్యాహ్నం నుండి కొత్తగూడెం ఏరియాలోని ఆర్ సి ఓ ఏ క్లబ్ రుద్రంపూర్ నందు కొత్తగూడెం ఏరియా జిఎం సమక్షంలో కొత్తగూడెం ఏరియాలోని అన్ని మైన్స్ డిపార్ట్మెంట్ అధికారులు సంబంధిత పిట్ సేఫ్టీ కమిటీ మైన్స్ కమిటీ సభ్యులు తో సుమారు 200 మంది సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవనీయులు చైర్మన్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జరుగుతున్న సీరియస్ రిపోర్టబుల్ యాక్సిడెంట్లు గురించి వివరించారు.

ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం మన సింగరేణి సంస్థ నందు జీరో హర్మ్ జీరో రిపోర్టబుల్ నినాదంతో ఉత్పత్తిని సాధించాలన్నారు. వివిధ రక్షణ అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి ప్రమాదం జరిగిన తర్వాత అప్రమత్తంగా ఉండడం కాకుండా ముందుగానే పనిచేయుచున్న స్థలాలను పరిశీలించుచు రక్షణ సూత్రాలను పాటిస్తే ఎటువంటి ప్రమాదం జరగదని అలాగే ప్రతి ఉద్యోగి ఇంటి నుండి



బయలుదేరినప్పుడు నుండి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని దాని కొరకు కూడా నా రక్షణ నా బాధ్యత నా రక్షణ నా కుటుంబ భద్రత అనే అవగాహన సదస్సుతో సింగరేణి మొత్తంలో ప్రతి ఒక్కరూ రక్షణ తో ఎలా పని చేయాలో అవగాహన కల్పించడం చేస్తున్నాం అని తెలియజేశారు. అలాగే ఫ్రంట్ లైన్ సూపర్వైజర్స్ కూడా పనులను సంబంధిత ఉద్యోగులకు చెబుతున్నప్పుడు ముందుగా పని స్థలములను గమనించి, పర్యవేక్షించి పనులు చేయించుకోవాలని తెలియజేశారు. సంస్థ ఉత్పత్తిలో ప్రతి ఉద్యోగి, అధికారి అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ సంస్థ అభివృద్ధిలో పాలు భాగస్తుల అవ్వాలని ముఖ్యంగా ఉత్పత్తితోపాటు రక్షణకు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ యొక్క సమావేశం నిర్వహిస్తున్నామని తెలియజేశారు ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతి ఉద్యోగి వారి తోటి ఉద్యోగులకు రక్షణ యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ సంస్థ ఉత్పత్తిలో పాల్గొందాలని తెలియజేశారు.

ఈ కార్యక్రమములో కొత్తగూడెం ఏరియా జిఎం తో పాటు ఎస్.ఓ.టు జిఎం ఎం. జీవి కోటిరెడ్డి, అధికారులు బి రవీందర్, ఎం. రమేష్, ఎం వెంకటేశ్వరరావు, ప్రహ్లాద, ఎం.వి.నరసింహారావు, సోమశేఖర్, టి. శ్రీకాంత్, పాలడుగు శ్రీనివాస్, టి. సత్యనారాయణ, కె శేషశ్రీ, కరిముల్లా, ఎం. శ్రీరామచంద్ర మురళి, బి రామకృష్ణ, ఇతర అధికారులు కొత్తగూడెం ఏరియాలోని యూనియన్ ప్రతినిధులు ఎండి రజాక్, రమణమూర్తి, సముద్రాల సుధాకర్ అన్ని మైన్స్ & డిపార్ట్మెంట్ లోని పిట్ సేఫ్టీ కమిటీ మైన్స్ కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.



## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ముదిరాజ్ సంఘ నాయకులు

వాయిస్ టుడే ఆగస్ట్ 10 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి): హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ముదిరాజుల సమగ్ర కుల సంఘ భవన సముదాయానికి 5 ఎకరాల స్థలం కేటాయించాలని నియోజక వర్గ ముదిరాజు కుల సంఘ నాయకులు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ ను కలిశారు. కొత్తకొండ దేవస్థానములో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. నియోజక వర్గములో పెద్ద సామాజిక వర్గమైన ముదిరాజుల అవసరాల కోసం, అభివృద్ధి కోసం ఆదరణ చూపాలని కోరారు. పోతారం గ్రామ శివారులో సర్వే నంబర్ 54 లో గల 5 ఎకరాల ప్రభుత్వ భూమిని సంఘ భవన సముదాయానికి కేటాయించాలని గత ప్రభుత్వ హాయములోనే ప్రతిపాదనలు పంపడమైనది. ఎన్నికల కోడ్ తదితర కారణాల వల్ల కేటాయింపు జరుగక పెండింగులో ఉంది. ముదిరాజ్ విద్యార్థుల వసతి గృహం, చేపల మార్కెటింగ్, కల్యాణ మండపం, పెద్దమ్మ గుడితో కూడిన సమగ్ర ముదిరాజు సంఘ భవన సముదాయానికి కేటాయించాలని కోరారు. మంత్రి వర్యులు స్థల కేటాయింపులో చొరవ చూపాలని, తదంతరం సంఘ భవనానికి కావాల్సిన నిధులు కేటాయించాలని సంఘ నాయకులు విన్నవించగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, సిద్దిపేట జిల్లా కలెక్టర్ తో మాట్లాడి పని జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. నియోజక వర్గములో ముదిరాజుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని, గత మాసములో కూడా హుస్నాబాద్ పట్టణ ముదిరాజు భవన రీడింగ్ రూమ్ నిర్మాణానికి 50 లక్షలు మంజూరు చేయించానని అన్నారు. నియోజక వర్గంలోని మత్స పారిశ్రామిక సహకార సంఘ భవనాలకు కూడా నిధులు కేటాయిస్తానన్నారు. మంత్రి హామీ పట్ల నాయకులు హర్షాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమములో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, పెండ్యాల ఐలయ్య, పొన్నబోయిన శ్రీనివాస్, పొన్నం మల్లయ్య, దొంతరబోయిన శ్రీనివాస్, జనవేణి శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వేముల శ్రీనివాస్, గట్టు ప్రశాంత్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కాశ బోయిన రవి, పులికాసి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి మేడిపల్లి భగతసింగ్ నగర్ కాలనీ పర్యటన

వాయిస్ టుడే న్యూస్, ఆగస్ట్ 10 మేడిపల్లి : శనివారం నాడు మేడిపల్లి మండలంలో నీ భగత్ సింగ్ నగర్ కాలనీ వాసుల నివాస ప్రాంతాన్ని, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి, పర్యటించడం జరిగింది. సి.పి.ఐ ఆధ్వర్యంలో భూ పోరాటాలు జరిపి పేద గుడిసె వాసులకు కరెంటు మీటర్లు, మౌలిక సదుపాయాల కల్పనకు పోరాటం చేసి, పేదలకు అండగా నిలబడింది. ఇప్పుడు ఉంటున్న ప్రాంతం మార్గము అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉన్నందున అటవీ శాఖ అధికారులతో మాట్లాడి దారిని కూడా కమ్యూనిస్టు పార్టీ పోరాటం ద్వారా సాధించుకోవడం జరిగింది. దానికి స్థానిక కమిటీ సభ్యులు స్థానిక కమ్యూనిస్టు పార్టీ నాయకులు, జిల్లా ఇన్చార్జి బాల మల్లేష్, జిల్లా సెక్రటరీ డీ.జీ.సాయిల్ గౌడ్, బి కే ఎం యు మండల కార్యదర్శి కాసోజు మహాలక్ష్మి,మేడిపల్లి భగత్ సింగ్ నగర్ వాసులు బి.కే.యం.యు. నాయకులు యాదమ్మ మహేశ్వరి, జ్యోతి ,కమలమ్మ, సహదేవు,కమిటీ సభ్యులు, నాయకులు ఏ.ఐ.ఎస్.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, జిల్లా కార్యదర్శి అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్ ఏ.ఐ.వై.ఎఫ్ నాయకులు నాగరాజు పాల్గొన్నారు. గుడిసె గుడిసె కు తిరిగి వారి వసతులను స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

**చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..**

కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షాన పోరాడి, ఇళ్ల పట్టాల కోసం, మౌలిక సదుపాయాల కోసం, కోర్టు కేసులను సైతం ఎదుర్కొంటూ, పేద ప్రజల పక్షాన ఉన్న పార్టీకి లబ్ధిదారులు, గుడిసేవాసులు పార్టీ సభ్యత్వం కొనసాగిస్తూ, పార్టీకి అండగా, పార్టీ ఇచ్చిన పిలుపులకు ఐక్య పోరాటాల ద్వారా తమ హక్కులను సాధించుకోవాలని కోరారు.

## జర్నలిస్ట్ యోగి అంతిమయాత్రలో పాల్గొన్న ఎంపీ

వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: తొలి వెలుగు ఛానల్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి జర్నలిస్ట్ యోగి మరియు తన కూతురు ఆధ్య మృతిచెందాగా విషయం తెలుసుకున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య దంపతులు జనగామలోని యోగి నివాసానికి చేరుకుని వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ఎంపీ కావ్య తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. అనంతరం జర్నలిస్ట్ యోగి అంతిమ యాత్రలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య నజీర్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ తాను ఎంచుకున్న జర్నలిజం మార్గంలో అవిశ్రాంతంగా కృషిచేసిన యోగి జీవితం ఇలా అర్ధాంతరంగా ముగియడం బాధాకరమన్నారు.



## మీడియా పాయింట్ ఆధ్వర్యంలో నివాళి




వాయిస్ టుడే, కాజీపేట: అనివార్య కారణాల వల్ల కూతురి తో సహా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న తొలి వెలుగు న్యూస్ ఛానెల్ ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో ఛీఫ్ యోగి రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ కాజీపేట మండలం మీడియా పాయింట్ ఆధ్వర్యంలో పత్రికావిలేఖరులు శనివారం కాజీపేట చౌరస్తాలో యోగిరెడ్డి మరియు ఆయన కూతురు చిత్రపటానికి నివాళులు అర్పించారు. మీడియా పాయింట్ గౌరవ అధ్యక్షులు రవీందర్ , ప్రధాన కార్యదర్శి కటుకూరి రవికుమార్, కొలిపాక కుమారస్వామి, నరేందర్, సదానందం, శ్రీహరి, పోగుల కుమార్, శ్రీనివాస్, ఉమేష్, రంజిత్, దుప్పటి శివకుమార్, సుదర్శన్, గిరి, దువ్వ రాజన్ బాబు, ఆగ్రారాజు, అచ్యుత్, ఫోటోగ్రాఫర్ అశోక్, షాకీర్, అఫ్రోజ్, శ్యాం, సుకుమార్ తదితరులు నివాళులు అర్పించారు.

## భద్రాచలం వద్ద 24 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం: శనివారం నిర్వహించిన సాధారణ వాహన తనిఖీలు మూడు ద్విచక్ర వాహనాలపై ఐదుగురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 24.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని సీలేరు ప్రాంతం నుంచి ఖమ్మం, హైదరాబాద్ తరలిస్తున్న వీరిని పట్టుకొని కేసు నమోదు చేశారు. వీరితోపాటు గతంలో పరారీలో ఉన్న ముద్దాయిని కూడా అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.



## రాజేందర్ సింగ్ జన్మదినం సందర్భంగా సాయి భోజన్

**బెల్లంపల్లి పట్టణంలోని పలుచోట్ల అన్నదానం పంపిణీ**

**బాయిజమ్మసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి ఆగస్టు 10 2024 (వాయిస్ టుడే) : తెలంగాణ కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్ పుట్టినరోజు సందర్భంగా ట్రస్ట్ సహకారంతో శనివారం మధ్యాహ్నం సాయి భోజన్ అన్నదానం పంచినట్లు సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్–రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు చోట్ల యాచకులకు, మానసిక వికలాంగులకు, వృద్ధులకు, అనాథలకు, రోగులకు, పేదవారికి, అన్నార్తులకు అన్నదానం పంచినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం పూట తమ ఆకలిని తీర్చిన బయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి అన్నదానానికి కారణమైన రాజేందర్ సింగ్ కి అన్నార్తులు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

విశిష్ట సేవలు అందించిన గొప్ప వ్యక్తి పేరిట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విద్యారంగంలో ఎన్నో విశిష్ట సేవలు అందించి, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకుడై, తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యాశాఖలోని అసిస్టెంట్ ప్రొఫెసర్లకు, అసోసియేట్ ప్రొఫెసర్లకు, ప్రిన్సిపాల్ లకు, కాంట్రాక్టు లెక్చరర్ లకు, అతిథి అధ్యాపకులకు, టీచింగ్, నాన్ టీచింగ్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ తనదైన శైలిలో సహాయ సహకారాలు సేవలు అందిస్తూ అభివృద్ధి ప్రయాణానికి మార్గదర్శకుడు రాజేందర్ సింగ్ అని బైజమ్మ సాయి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి తెలిపారు. అలాంటి గొప్ప వ్యక్తి పేరిట తమ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేయడం తమకు దక్కిన గొప్ప అవకాశం గా భావిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సేవా ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు, సేవకులు దాసరి రాజేష్, బూరుగు ప్రవీణ్, మహర్షిత్, మని, వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో పత్రికలదే విశ్వసనీయత

**కొవిడ్ అనంతరం మీడియాలో సంక్లిష్ట పరిస్థితి**

**బుక్‌బ్రహ్మ చర్చాగోష్టిలో 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్**



బెంగళూరు, ఆగస్టు 10 : సమాజంలో పత్రికలదే విశ్వసనీయత అని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌లో భాగంగా రెండోరోజు శనివారం ఐదు వేదికల ద్వారా బెంగళూరు కోరమంగళలోని సెయింట్ జాన్స్ ఆడిటోరియంలో సాహితీవేత్తలు, రచయితలు, భాషాభిమానులతో సందడి నెలకొంది. 'మీడియాలో సాహిత్య ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్టిని 'ది హిందూ' ఎడిటర్ భాగ్యశ్రీ సుబ్బణ్ణ పర్యవేక్షించారు. కె.శ్రీనివాస్, డెక్కన్ హెరాల్డ్ ఎడిటర్ రామకృష్ణ, ప్రిజమ్ బుక్స్ నుంచి సుధీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మేగజైన్లు ఎక్కువ సాహిత్యంతోనే సాగేవని, కొవిడ్ తర్వాత అవి బాగా తగ్గుముఖం పట్టాయని అన్నారు. పత్రికల్లోనూ 50 శాతం స్థలాభావం ఏర్పడిందన్నారు. తెలుగులో 19వ శతాబ్దంలోనే మ్యాగజైన్ల ప్రభావం ఎక్కువగా ఉండేదని, ఆధ్యాత్మికం, సామాజిక అంశాలపై కథనాలు ఉండేవని తెలిపారు. 'ఆంధ్రపత్రిక' సాహిత్యంతోనే సుదీర్ఘకాలం కొనసాగిందని పేర్కొన్నారు. 1920లో భారతి, గోల్కొండ లాంటి మేగజైన్లు ప్రాచుర్యంలో ఉండేవని గుర్తుచేశారు. 1960లో ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావు నేతృత్వంలో 'ఆంధ్రజ్యోతి' ప్రారంభమైందని, ఆయన సాహిత్యానికి నిరంతరం ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు.

## మల్లారెడ్డి వర్సిటీలో విద్యార్థుల ఆందోళన

**విద్యార్థి మృతిని నిరసిస్తూ అద్దాలు, సామగ్రి ధ్వంసం**

**ఆస్పత్రికి తరలించడంలో జాప్యం చేశారని ఆగ్రహం**

**సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటాం: వీసీ**

మేడ్చల్ టౌన్, ఆగస్టు 10: అస్వస్థతకు గురైన విద్యార్థిని ఆస్పత్రికి తీసుకెళ్లడంలో వర్సిటీ సిబ్బంది నిర్లక్ష్యం వహించారని, ఆ కారణంగానే అతడు మృతి చెందాడంటూ మల్లారెడ్డి వర్సిటీలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో ఉన్న మల్లారెడ్డి యూనివర్సిటీలో మూడు రోజుల క్రితం ఎ.అరుణ్‌కుమార్ అనే విద్యార్థి తరగతి గదిలోనే కుప్పకూలగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందించేలోపే మరణించిన విషయం తెలిసిందే. అయితే, వర్సిటీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి చెందాడంటూ అగ్రికల్చర్ విద్యార్థులు శనివారం ఆందోళనకు దిగారు.

